
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 24.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 212
పేజీలు: 08 వెల: రూ. 5



■ సీఎం రేవంత్ మౌనం వెనుక రాజకీయ వ్యూహమా?
■ 'డిజాస్టర్ ప్రెసిడెంట్' అంటూ ప్రచారం.. కాంగ్రెస్‌లో కలకలం
■ ఢిల్లీకి నేరుగా ఫిర్యాదులే కారణమా..?
■ బీసీ సీఎం వ్యాఖ్యలపై రేవంత్ అసహనం అన్న ప్రచారం
■ డీసీసీ పదవి వివాదంతో మీడియా టార్గెట్ ఆరోపణలు
■ రెండు వర్గాలుగా విడిపోయిన తెలంగాణ కాంగ్రెస్
■ మహేష్ మార్క్ పెరగడమే అసలు కారణమా..?
■ 'కాలమే సమాధానం చెబుతుంది'..
■ విదేశాల నుంచి మహేష్ స్పందన

# టార్గెట్ టీపీసీసీ చీఫ్?

కాంగ్రెస్‌లో మళ్లీ గ్రూప్ వార్!

### అనుకూల మీడియా ఛానెల్‌లో మహేష్ కుమార్ గౌడ్‌పై కథనాలు

**ముద్ర డెస్క్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమవుతున్నాయా..? అధికారంలోకి వచ్చిన తర్వాత కాస్త సద్దుమణిగిన గ్రూపు రాజకీయాలు మళ్లీ తెరపైకి వచ్చాయా..? అనే చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే ఓ ప్రముఖ తెలుగు శాటిలైట్ ఛానెల్‌లో వరుసగా ప్రసారమవుతున్న ప్రతికూల కథనాలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఎదుర్కొంటున్న అదే ఛానెల్ అకస్మాత్తుగా టీపీసీసీ చీఫ్‌ను టార్గెట్ చేయడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'డిజాస్టర్ ప్రెసిడెంట్', 'ఏఐసీసీ విశ్వాసం కోల్పోయిన నేత', 'క్యాడర్‌ను పట్టించుకోని అధ్యక్షుడు' అంటూ ప్రసారం అవుతున్న కథనాలు కాంగ్రెస్ నేతలను అసహనానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా గాంధీభవన్ పరిస్థితులు, గోడల పెచ్చులు, బీరు బాటిళ్ల వంటి అంశాలను సైతం మహేష్ కుమార్ గౌడ్ వైఫల్యంగా చూపించడం వెనుక ఉద్దేశపూర్వక ప్రచారం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఉన్నప్పటికీ గాంధీభవన్ పరిస్థితి ఇలాగే ఉందని, ఇప్పుడు మాత్రం అన్నింటినీ మహేష్ ఖాతాలో వేయడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పార్టీ పలు ఎన్నికల్లో విజయాలు సాధించింది. సర్పంచ్ ఎన్నికల్లో ఆధిపత్యం ప్రదర్శించడంతో పాటు నిజామాబాద్‌లో మున్సిపాలిటీలను గెలుచుకుంది. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలోనూ విజయం సాధించింది. ఇలాంటి సమయంలో ఆయనను "విఫలమైన అధ్యక్షుడు"గా చిత్రీకరించడం వెనుక అసలు లక్ష్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మిగతా 02లో

# మోదీజీ అమెరికా రండి..

### అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆహ్వానం



■ భారత్-అమెరికా సంబంధాలపై కీలక చర్చలు
■ ట్రంప్ విజ్ఞప్తి మేరకు ఆహ్వానించిన రూబియో
■ పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ-రూబియో చర్చ
■ క్వాడ్ సమావేశాల కోసం భారత్‌లో రూబియో పర్యటన

02

# హైదరాబాద్ నడిబొడ్డున అన్నగారి నిలువెత్తు విగ్రహం

### మే 28న ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి



■ అమీర్‌పేట మైత్రీవనం కూడలికి 'ఎన్టీఆర్ సర్కిల్' నామకరణం
■ కొత్తపేటలో రూపుదిద్దుకున్న 13 అడుగుల కాంస్య విగ్రహం

04

# మండుతున్న సూరీడు!

### 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

■ మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో జనం, వన్యప్రాణులు ఉక్కిరిబిక్కిరి
■ కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో అత్యధికంగా 46.3 డిగ్రీలు
■ వచ్చే వారంరోజుల్లో ఉత్తర, దక్షిణ జిల్లాల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు

02

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలో సూర్యుడి ప్రతాపానికి ప్రజలువిలవిలలాడిపోతున్నారు. మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఓ వైపు వేడిగాలులు వీస్తోంటే.. మరో వైపు ఉక్కపోత ఊపిరి సలపనివ్వడంలేదు. శనివారం రాష్ట్రంలో 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీలు దాటాయి. కొత్తగూడెం, జగిత్యాల జిల్లాల్లో అత్యధికంగా 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా.. అత్యల్పంగా నారాయణపేట జిల్లాలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కుమురంభీం ఆసిఫాబాద్ లో మిగతా 02లో




# హీట్ వేవ్‌పై హై అలర్ట్

■ ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత
■ వడగాల్పులతో ఏడు జిల్లాల్లో 16 మంది మృత్యువాత
■ మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం
■ రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సమీక్ష

03

### గొడ్డలి పార్టీకి ప్రజాస్వామ్యంలో

# చోటులేదు

### అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి చూస్తున్నారు

■ తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు ప్రజలను ఏం చూస్తారు?
■ ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్ అందించే దిశగా సంజీవని
■ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించింది ఎన్డీయే కూటమి
■ కండ్రిగలో సంజీవని కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఏపీ సీఎం చంద్రబాబు

**ముద్ర, హైదరాబాద్**
'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా? సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. ''అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై మిగతా 02లో




■ జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం
■ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్
■ భద్రతా బలగాల కేంద్రాలకు భూముల కేటాయింపు
■ తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు..

### గోదావరి పుష్కరాలకు

# రూ.1000 కోట్లు

### విద్యార్థులు, భక్తులు, నిరుద్యోగులకు గుడ్‌న్యూస్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భక్తులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడే పథకాలపై మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా 2027 గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం భారీగా నిధులు కేటాయించడం, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం వంటి నిర్ణయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**గోదావరి పుష్కరాలకు భారీ నిధులు**
2027లో జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు రూ.1000 కోట్ల కేటాయింపునకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్ల విడుదలకు పచ్చజెండా ఊపింది. పుష్కరాల సమయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఘాట్‌లు, రహదారులు, తాగునీరు, పారిశుధ్య వసతుల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించనున్నారు.

**జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం**
రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే పాఠశాలల్లో అమలవుతున్న విధానాన్ని ఇప్పుడు ఇంటర్ విద్యార్థులకు విస్తరించనున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ప్రతి మిగతా 02లో

### కారుతో ఢీకొట్టి

# న్యాయవాది హత్య

### మాసబ్‌ట్యాంక్‌లో లాయర్ దారుణ హత్య

■ సీసీటీవీలో రికార్డ్ అయిన హత్య దృశ్యాలు
■ టార్గెట్ చేసి లాయర్‌ను చంపిన దుండగులు
■ ఖాజా మొయినుద్దీన్ హత్యతో హైదరాబాద్ లో కలకలం
■ వక్ఫ్ బోర్డు ఆక్రమణలపై పోరాడుతున్న ఖాజా
■ అలీంఖాన్ చేసిన హత్య అంటున్న ఖాజా కుమారుడు

03



# బీఆర్ఎస్ నేత హత్య

### సూర్యాపేట జిల్లాలో మరో రాజకీయ హత్య



■ మాజీ సర్పంచ్ చింతలపాటి మధు హత్య
■ పాత రాజకీయ కక్షలే కారణమని పోలీసుల ప్రాథమిక అంచనా
■ మధుది కాంగ్రెస్ హత్యే : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి
■ గ్రామంలో ఉద్రిక్తత, భారీగా పోలీసుల మోహరింపు

02

# యాదాద్రికి మరిన్ని హంగులు


### అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

■ ₹99.55 కోట్లతో ఆలయ అనుబంధ పనులు
■ శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
■ కంచికామకోటి పీఠాధిపతితో కలిసి పర్యటన
■ వేద విజ్ఞాన పరివ్యాప్తికి ప్రత్యేక పాఠశాల


02



ఇదీ AI
ముద్ర



## బోన్ క్యాన్సర్ : ప్రారంభ లక్షణాలు




ఎముకల్లో తరచూ వచ్చే సాధారణ నొప్పులను సాధారణ అలసటగా భావించి అశ్రద్ధ చేయకూడదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో నొప్పి తీవ్రతరం కావడం లేదా ఎముకపై ఒత్తిడి పడినప్పుడు నొప్పి రావడం వంటి సంకేతాలపై నిఘా ఉంచాలి.

# గొడ్డలి పార్టీకి ప్రజాస్వామ్యంలో చోటులేదు



(మొదటి పేజీ తరువాయి)
గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి'' అని సీఎం అన్నారు.

**రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఏఐ డాక్టర్**

ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా చిత్తూరు జిల్లా కండ్రిక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు.

# గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)
రోజూ ఉదయం అల్పాహారం, పాలు అందించాలని కూడా మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు పెద్ద ఊరట లభించనుంది.

**ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్**

నిరుద్యోగ యువతకు కూడా కేబినెట్ గుడ్‌న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని నూతన డిగ్రీ కళాశాలలో 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. అలాగే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం అగ్నిమాపక కేంద్రానికి 18 పోస్టుల మంజూరుకు కూడా అంగీకారం తెలిపింది.

**భద్రతా బలగాల కేంద్రాలకు భూముల కేటాయింపు**

కరీంనగర్ జిల్లాలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మానకొండూరు మండలం వెలిదిలో 14 ఎకరాలు, చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో 5 ఎకరాలు, గన్నేరువరం మండలంలో మరో 5 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది.

**మరిన్ని అంశాలపై చర్చ**

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న కార్యక్రమాలపై కూడా కేబినెట్ చర్చించింది. ఇందిరమ్మ కుటుంబ బీమా, కొత్త పెన్షన్ల పంపిణీ వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మొత్తంగా ఈ కేబినెట్ సమావేశం విద్యార్థులు, భక్తులు, నిరుద్యోగులు, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలతో సాగింది.

# మండుతున్న సూరీడు!

(మొదటి పేజీ తరువాయి)
46.2, సూర్యాపేటలో 46.2, ఖమ్మంలో 46.1, మంచిర్యాలలో 46.1, ములుగు 46, పెద్దపల్లి 45.9, భూపాలపల్లి 45.7, నల్గొండ 45.7, నిర్మల్ 45.5, నిజామాబాద్ 45.5, కరీంనగర్ 45.3, మహబూబాబాద్ 45.3, వరంగల్ 45.2, సిద్ధిపేట 45.1, హనుమకొండ 44.6, ఆదిలాబాద్ 44.5, రాజన్న సిరిసిల్ల 44.5, జనగామ 44, కామారెడ్డి 43.5, భువనగిరి 43.1, మెదక్ 42.4, హైదరాబాద్ 42.1, మేడ్చల్ మల్కాజిగిరి 42, రంగారెడ్డి 41.9, సంగారెడ్డి 41.8, నాగర్ కర్నూల్ 41.7, మహబూబ్ నగర్ 41.6, వనపర్తి 41.5, వికారాబాద్ 41.2, గద్వాల 40.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**మున్ముందు ముప్పుంది...!**

రాబోయే వారంరోజుల్లో ఉత్తర, దక్షిణ జిల్లాల్లో 43 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వనపర్తి, గద్వాల, మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో 40 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, అక్కడక్కడా చిరుజల్లులు ఉపశమనాన్నిస్తాయని పేర్కొంది. హైదరాబాద్ లో మరికొద్దిరోజులపాటు 41, 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావొచ్చని, ఈ నెల 24, 25 తేదీల్లో మోస్తరు వర్షం కాస్త ఉపశమనం ఇస్తుందని వెల్లడించింది. అలాగే... మహబూబ్ నగర్, వనపర్తి, గద్వాల్, అచ్చంపేట్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో రాబోయే 2-3 గంటల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే ఛాన్సుందని, ఈ సమయంలో 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. ఆ సమయంలో చెట్లు, హోర్డింగుల వద్ద ఎవరూ ఉండవద్దని కోరింది.

# బీఆర్ఎస్ నేత హత్య

**ముద్ర డెస్క్ :**
సూర్యాపేట జిల్లాలో రాజకీయ కక్షలు మరోసారి రక్తపాతం సృష్టించాయి. యర్కారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ సర్పంచ్ చింతలపాటి మధును గుర్తుతెలియని వ్యక్తులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

మధును గ్రామంలోనే హత్య చేసి, మృతదేహాన్ని మూడు ముక్కలుగా నరికి మూడు గోనె సంచుల్లో కట్టి గ్రామ సమీపంలోని ఎస్ఆర్ఎస్పీ కాలువలో పడేసి దుండగులు పరారయ్యారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గ్రామంలో పాత రాజకీయ వైషమ్యాలే ఈ హత్యకు కారణంగా పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం జరిగిన అప్పటి సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో చింతలపాటి మధు ప్రధాన నిందితుడుగా ఉన్నారు. ఈ ఘటనతో యర్కారం గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఈ ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది.

హత్యా రాజకీయాలను ప్రోత్సహించడం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ గుండాల చేతిలో హత్యకు గురైన బీఆర్ఎస్ నాయకుడు చింతలపాటి మధు మృతదేహానికి మాజీ మంత్రి సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శనివారం జనరల్ ఆసు పత్రిలో నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు.

# యాదాద్రికి మరిన్ని హంగులు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, రూ.99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట క్షేత్రంలో వేద పాఠశాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూమి పూజలో పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా 99.55 కోట్ల రూపాయలతో చేపట్టే పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో రూ.43.80 కోట్లతో అత్యాధునిక వసతులతో వేద పాఠశాల నిర్మాణం. రూ. 43.12 కోట్లతో భక్తులు, దీక్షాపరుల వసతి కోసం ప్రత్యేక సదనాలు, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ.9.87 కోట్లతో మండప నిర్మాణం, వైకుంఠ ద్వారం నుండి కొండపైకి వెళ్లే భక్తుల సౌకర్యార్థం రూ. 1.41 కోట్లతో పైకప్పు నిర్మాణం పనులు చేపట్టనున్నారు. అలాగే రథశాల వైపు ఉన్న మాడ వీధులకు రూ.1.35 కోట్లతో మెట్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ఆధ్యాత్మిక, అభివృద్ధి కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, యాదాద్రిని మరింత ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దేందుకు ఈ నిధులు ఎంతగానో దోహదపడనున్నాయి.

వేదవిజ్ఞాన పరివ్యాప్తికి ప్రత్యేక పాఠశాల తిరుమల తరహాలో యాదగిరిగుట్ట ఆలయాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా వేదవిజ్ఞాన పరివ్యాప్తికి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన వేదపాఠశాల నెలకొల్పాలని సంకల్పించారు. దానిలో భాగంగా స్వామివారు కొలువైన యాదగిరికొండకు అభిముఖంగా ఉన్న పెద్దగుట్ట టెంపుల్‌సిటీ లేఅవుట్ వద్ద 15ఎకరాల విస్తీర్ణంలో వేద పాఠశాలను నిర్మించనున్నారు. రూ.43.80కోట్ల అంచనా వ్యయంతో వేదపాఠశాల భవన సముదాయం నిర్మించనున్నారు. ఈ నిర్మాణానికి యాదగిరిగుట్ట దేవస్థానం కేవలం రూ.5 కోట్లు కేటాయిస్తుండగా, మిగతా నిధులు దేవాదాయ శాఖకు చెందిన సర్వశ్రేయోనిధి( సీజీఎఫ్) నుంచి నిధులు సమకూర్చుతున్నారు.

ఆశ్రమ గురుకుల విద్యా బోధనా పద్ధతిలో 300 మంది విద్యార్థులకు, వేద బోధన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి అవసరమైన వసతులు ఏర్పాటు కానున్నాయి. సువిశాల బోధనా మందిరాలు, సమావేశ మందిరం, వసతి భవనాలు, భోజనం సిద్ధం చేయడానికి సువిశాలమైన వంటగది, హోమాలు, యాగాలకు ప్రత్యేక శాలలతోపాటు గోశాలను నిర్మించనున్నారు. వేద పాఠశాలలో చేరే విద్యార్థులకు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలతో పాటు.. ఆగమ శాస్త్రాలను కూడా బోధిస్తారు. ఇది తెలంగాణలోనే కాకుండా దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద వేద పాఠశాలగా నిలవనుంది.





# మోదీజీ అమెరికా రండి

**ముద్ర డెస్క్ :**
ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. వీరిద్దరి మధ్య దాదాపు గంటకుపైగా చర్చలు సాగాయి. ఈ సందర్భంగా మార్కో రూబియో మోదీని అమెరికా ప్రర్యటనకు రావాలని ఆహ్వానించారు. యుఎస్ఏ అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తి మేరకే ఈ ఆహ్వానం అందించినట్లు రూబియో పేర్కొన్నారు. మోదీతో ప్రధానంగా పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులపై ఇరు నేతలు చర్చలు జరిపారు. సంక్షోభ పరిష్కారానికి దౌత్య చర్చలే ప్రధానమార్గామని మోదీ సూచించారు. అనంతరం ప్రధాని మోదీ, రూబియోతో తన సమావేశానికి సంబంధించిన కొన్ని దృశ్యాలను పోస్ట్ చేశారు. కాగా మార్కో రూబియో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చారు. ఆయన విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. భారత్–పాక్ మధ్య అణు యుద్ధాన్ని ఆపానంటూ ట్రంప్ పదేపదే ప్రకటించుకోవడం, భారీ టారిఫ్‌లు, హెచ్ 1బీ వీసాల కట్టడి చర్యలు తదితరాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను తిరిగి గాడిన పెట్టడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు.

విదేశాంగ మంత్రి జై శంకర్‌తో ఆదివారం ప్రత్యేకంగా సమావేశమై అనేక అంశాలపై చర్చలు జరుపుతారు. మంగళవారం ఢిల్లీలో జరిగే క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశాల్లో పాల్గొంటారు. రూబియో పర్యటన సందర్భంగా కోల్‌కతా, జైపూర్, ఆగ్రాలను కూడా సందర్శించే అవకాశముందని సమాచారం. 'భారత్‌తో మాకు చాలా పనుంది. భారత్ మాకు మంచి మిత్ర దేశం, భాగస్వామి కూడా. నాది చాలా ముఖ్యమైన ట్రిప్'అంటూ శుక్రవారం రూబియో వ్యాఖ్యానించడం గమనార్హం.

# టార్గెట్ టీపీసీసీ చీఫ్?

(మొదటి పేజీ తరువాయి)
ఇక సీఎం రేవంత్ రెడ్డి మౌనం కూడా అనుమానాలకు తావిస్తోంది. తనకు అత్యంత సన్నిహితుడిగా భావించే మహేష్ కుమార్ గౌడ్‌పై వరుస కథనాలు వస్తున్నా ఎలాంటి స్పందన లేకపోవడం రాజకీయ చర్చకు కారణమైంది. రాష్ట్ర వ్యవహారాలపై మహేష్ నేరుగా ఢిల్లీ హైకమాండ్‌కు సమాచారం ఇస్తున్నారనే అసంతృప్తి సీఎం వర్గంలో ఉందని, ముఖ్యంగా "మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుంది.. ఈసారి బీసీ సీఎం అవుతారు'' అన్న మహేష్ వ్యాఖ్యలు రేవంత్‌కు ఆగ్రహం తెప్పించాయనే ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే ఆ మీడియా సంస్థకు చెందిన బంధువుకు మహబూబాబాద్ డీసీసీ పదవి దక్కకపోవడంతో కావాలనే టార్గెట్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్‌లో మహేష్ కుమార్ గౌడ్–మీనాక్షి నటరాజన్ వర్గం ఒకటిగా.. సీఎం రేవంత్ టీమ్ మరో వర్గంగా మారిందనే ప్రచారం జోరందుకుంది. వెలుగుమట్ల, హెచ్‌సీయూ భూముల అంశాల్లో హైకమాండ్ నిర్ణయాల వెనుక కూడా మహేష్ పాత్ర ఉందని రేవంత్ వర్గం అనుమానిస్తోందనే చర్చ నడుస్తోంది. అయితే మహేష్ కుమార్ గౌడ్‌పై విమర్శలు పూర్తిగా ఆధారరహితం కాదని చెప్పేవారూ ఉన్నారు. క్యాడర్‌ను పూర్తిగా కలుపుకుపోవడంలో విఫలమయ్యారని, ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో చురుకుదనం చూపలేదని, గాంధీభవన్‌కు రాక తగ్గి విదేశీ పర్యటనలు పెరిగాయని విమర్శలు ఉన్నాయి. కానీ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడాన్ని నిర్ణయించేది టీపీసీసీ కాదు, ప్రభుత్వ పనితీరేనని మరో వర్గం వాదిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే మహేష్ కుమార్ గౌడ్‌ను నేరుగా తప్పించలేక రాజకీయంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కుటుంబంతో విదేశీ పర్యటనలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ.. "మీడియా కథనాలకు కార్యకర్తలు అధైర్యపడొద్దు. మీడియాను గౌరవించడం మన బాధ్యత. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది'' అంటూ ప్రకటన విడుదల చేశారు.

# బీజేపీకి అవకాశం ఇస్తే అవినీతి రహిత పాలన అందిస్తాం

## బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో బీజేపీకి ఒక అవకాశం ఇస్తే పారదర్శక, అవినీతి రహిత, ప్రజల సంక్షేమాన్ని ముందుంచే పరిపాలన అందిస్తామని ఆ పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు వెల్లడించారు. శనివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలకుల దారిలో నడుస్తోందనే భావన ప్రజల్లో బలపడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కొత్త ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్ల డీపీఆర్‌లు తయారు చేస్తూ, ప్రజల సంక్షేమం కన్నా తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని మరింత అప్పుల బారిన పడేస్తూ, ప్రజలపై భారం మోపే పరిస్థితి తీసుకొస్తున్నారని మండిపడ్డారు. రైతుల ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, మక్క, జొన్నతో పాటు ఇతర పంటలను కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఆ హామీలను నిలబెట్టుకోలేక రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరైన సమాచారం ఇవ్వకుండా, కొనుగోళ్లలో ఆలస్యం చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులను మోసం చేయడం మానుకొని, రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మోసపూరిత రాజకీయాలను ఇక నమ్మవద్దని కోరారు. ప్రధాని మోదీ 12 ఏళ్లుగా దేశానికి నిజాయితీ, అవినీతి రహిత పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు.

## అధిష్టానానిదే టీపీసీసీ

# మార్పు తుది నిర్ణయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
టీపీసీసీ మార్పు విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయమని టిపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాను సరైన వ్యక్తిని అనే తనకు పీసీసీ చీఫ్ పదవి ఇచ్చారన్నారు. ఏఐసీసీ దృష్టిలో తాను బెస్ట్ పీసీసీ చీఫ్ అని చెప్పారు. శనివారం గాంధీభవన్ లో ఆయన చిట్ చాట్ చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తనను అనేకసార్లు అభినందించారన్న మహేశ్ కుమార్ గౌడ్.. తాను, సీఎం కలిసి పని చేయడం కొందరికి మింగుడుపడడం లేదని ఆరోపించారు. తనపై వచ్చిన కథనాలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు, అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వేచ్ఛ మీడియాకి ఉందన్నారు. చిన్నాచితక విషయాలపై తన సమయాన్ని వెచ్చించనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గాంధీ భవన్ ట్రస్ట్ వాళ్ళదని, తనపై ఒక ఛానెల్ ప్రచారం చేస్తే అది ప్రామాణికం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. తన పనితీరుని బేరీజు వేయాల్సింది సీఎం, తన పార్టీ కార్యకర్తలని, తాను పత్రిక స్వేచ్ఛను అర్థం చేసుకున్న వ్యక్తిని అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అన్నింటికి కాలమే సమాధానం చెపుతుందని ఆయన అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఏఐసీసీకి పంపించామన్న పార్టీ చీఫ్.. త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని చెప్పారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుంటారని, విస్తరణలో తన ప్రమేయం ఏముందదని ఆయన స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచి గా మారుతుందని, సిటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుంది..హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీష్ రావు అంటున్నారా? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ కు దూరదృష్టి లేదు హైదరాబాద్ పరిధిని పెంచలేదని, తెలంగాణపై కేంద్రం సవితి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆయన ఆరోపించారు. స్టాలిన్ లాగే తాము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 24.05.2026
www.mudranews.in | @mudranews



**బోన్ క్యాన్సర్ :** వాపులు, గడ్డలను గమనించండిశరీరంలో ఎక్కడైనా ఎముకల భాగంలో అకస్మాత్తుగా వాపు రావడం లేదా గట్టిగా గడ్డలా తగలడాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ఇటువంటి మార్పులు కనిపించిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం అవసరం.



## రోజ్ గార్ మేళాతో యువతకు ఉద్యోగాలు

**సికింద్రాబాద్‌లో 19వ విడత కార్యక్రమం**

**218 మందికి నియామక పత్రాలు అందజేసిన కేంద్రమంత్రి శ్రీ కిషన్‌రెడ్డి**



**ముద్ర, హైదరాబాద్:** నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వారికి సాధికారత కల్పించే దిశగా 'రోజ్‌గార్ మేళా' కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూపకల్పన చేశారని, 2022 నుంచి ఈ మేళాల ద్వారా లక్షలాది మంది యువతకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 19వ విడత 'రోజ్‌గార్ మేళా' కార్యక్రమం శనివారం సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ వేదికగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి శ్రీ కిషన్‌రెడ్డి హాజరై.. కొత్తగా కేంద్ర ప్రభుత్వంలోని ఆరు శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైన 218 మంది యువతీయువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.'రోజ్‌గార్ మేళా'ను ఉద్దేశించి శ్రీ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూల్లో ఖాళీలు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తోందని అన్నారు. ఇప్పుడు దేశ యువతీయువకులు ఉద్యోగార్థులుగా కాకుండా.. ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ఆయన పేర్కొన్నారు. అంకుర సంస్థలు సైతం లక్షలాది ఉద్యోగాలను కల్పిస్తున్నాయని, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా తయారీ రంగంలోనూ పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తున్నాయని గుర్తుచేశారు.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగం లభించడం ద్వారా 20–30 ఏళ్లు దేశానికి సేవ చేసే అవకాశం లభించినందున, దేశాభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. తమ కోసం ఎన్నో కష్టాలు పడిన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయవద్దని, వారికి వృద్ధాప్యంలో తోడుగా ఉండాలని సూచించారు.దేశవ్యాప్తంగా ఒకేసారి జరిగిన 19వ విడత రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం శ్రీ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ సిద్ధార్థ్ కటి, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## కారుతో ఢీకొట్టి..న్యాయవాది హత్య

**మాసబ్ ట్యాంక్ సమీపంలో ఉదంతం**

**సీసీ టీవీలో రికార్డైన హత్య దృశ్యాలు**



**ముద్ర, డెస్క్:** హైదరాబాద్ లోని మాసబ్ ట్యాంక్ సమీపంలో న్యాయ వాది ఖాజా మొయినుద్దీన్‌ను ఓ కారు ఢీకొట్టింది. తన కారు ఎక్కుతున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఇది గమనించిన కుటుంబీకులు ఖాజాను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొన్ని గంటలకే అడ్వకేట్ మృతి చెందారు. ఇక ఈ ఘటన నగరంలో సంచలనం సృష్టించింది. మొదట ఈ ఘటనను హిట్ అండ్ రన్ కేసుగా నమోదు చేసిన పోలీసులు, తరువాత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో వక్ఫ్ బోర్డ్ భూముల వివాదంలోనే హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వివాదాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం పోరాడుతున్న ఖాజా మోహిజుద్దీన్ హత్యపై ఆయన ఆయన కుమారుడు ఫర్హాన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సంచలన ఆరోపణలు చేశారు. తమ తండ్రి హత్యకు కాంగ్రెస్ నాయకుడు ఆలం ఖానే కారణమని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం దశాబ్దాలుగా తన తండ్రి పోరాటం చేస్తున్నారని, అదే కారణంగా అనేకసార్లు బెదిరింపులు, దాడులు ఎదుర్కొన్నారని తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై ఖాజా మొయినుద్దీన్ స్నేహితురు అడ్వకేట్ శ్యామ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. పక్కా రెక్కీ చేసి నెంబర్ ప్లేట్ లేని కారుతో ఢీకొట్టి చంపేశారని అన్నారు. దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారని మలక్‌పేట్‌లో వక్ఫ్ ఆస్తులు, భూమి విషయాలకు సంబంధించి ఆలంఖాన్, మహబూబ్ అలంఖాన్‌లతో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌కు వివాదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో కూడా నిందితులిద్దరూ న్యాయవాదికి హాని తలపెట్టడానికి ప్రయత్నించారని, గతంలో ఖాజా ఈ అంశంపై హబీబ్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. అప్పుడు పోలీసు అరెస్ట్ చేసి ప్రత్యర్థులను రిమాండ్ తరలించారని, దీనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు నమోదైనట్లు తెలిపారు. చనిపోయే ముందు తనతో కొద్దిసేపు మాట్లాడారని పేర్కొన్నారు. ఆయన ఎక్కువగా వక్ఫ్ భూముల తగాదాల కేసులు వాదిస్తారు. రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ కరువైంది. ఈ అంశంపై పోలీసులు సీరియస్‌గా దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వక్ఫ్ బోర్డు భూముల వివాదంలో ఓ కాలేజీ మెనేజ్‌మెంట్ ప్రమేయం కూడా ఉందన్నారు.

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. శనివారం కురిసిన వర్షం సమయంలో పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొర్రెలను మేపేందుకు వెళ్లిన సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు.భారీ వర్షాలు, ఉరుములు మెరుపుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## హీట్ వేవ్‌పై హై అలర్ట్

**ప్రజల, ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత**

**వడగాల్పులతో ఏడు జిల్లాల్లో 16 మంది మృత్యువాత**

**మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం**

**రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సమీక్ష**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరిగే అవకాశముందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన అత్యవసర సమీక్ష సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులను మంత్రి సమీక్షించారు. జిల్లాల వారీ నివేదికల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కరు చొప్పున మొత్తం 16 మంది వడదెబ్బతో మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించి, ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. మీడియా, సోషల్ మీడియా, గ్రామస్థాయి ప్రకటనల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాల్లో చల్లని తాగు నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికులకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రతి జిల్లా కలెక్టర్ హీట్ వేవ్ పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, గ్రామస్థాయి సిబ్బంది ఫీల్డ్‌లో ఉండాలని సూచించారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. పక్షులు, జంతువుల కోసం గ్రామాలు, పట్టణాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని సూచించారు.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం ఈ నెల 26 వరకు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వడగాల్పులు కొనసాగనున్నాయని అధికారులు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి కోరారు.

### బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సెటైర్లు వేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ ప్రకటనలు చేస్తోన్న హరీశ్ రావు .ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా? అని నిలదీశారు. బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదని వ్యాఖ్యానించారు. శనివారం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రో స్టేషన్ కూడా ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్సిటీకి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు.

## హైదరాబాద్ పోలీసుల మరో ఘనత

**10 కిపైగా భాషల్లో కేసుల ఫిర్యాదుకు అవకాశం**

**దేశంలోనే మొట్టమొదటి ఏఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్**

**అమల్లోకి ఏఐ కాప్‌రైటర్' యాప్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ పోలీసులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫిర్యాదు రికార్డర్ అయిన 'ఏఐ కాప్‌రైటర్' యాప్‌ను అమల్లోకి తెచ్చారు. శనివారం బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీలో జరిగిన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా 10 కిపైగా భాషల్లో కేసులను ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు.యాప్‌లో చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్ రూపంలో మార్చుతుందని చెప్పారు. ఒక భాష నుంచి మరో భాషకు ట్రాన్స్‌లేట్ చేస్తుందని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసే సదుపాయం కూడా ఉందని వివరించారు. ఇతర రాష్ట్రాల ప్రజలు, వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు.. ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ద్వారా భారీ ఉపశమనం లభిస్తుందని చెప్పారు. బాధితులకు న్యాయం అందించడానికి భాష అడ్డు కాకూడదు అనే లక్ష్యంతో ఈ ఏఐ కాప్‌రైటర్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. మొదట హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్ స్టేషన్లలో ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సజ్జనార్ తెలిపారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియను వేగంతోపాటు.. కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు ఈ ఏఐ కాప్‌రైటర్ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ను బ్లూకౌడ్ సాఫ్టెక్ సొల్యూషన్స్ సహకారంతో రూపొందించినట్లు చెప్పారు.కాగా, ఫిర్యాదు నమోదు చేసే సమయంలో భాష పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురుకావడం.. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరగడం.. సమాచారం తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలకు ఈ యాప్‌తో చెక్ పెట్టనున్నారు. హిందీ, తమిళం, బెంగాలీ, మరాఠీ వంటి 10 భారతీయ భాషల్లో మాట్లాడితే.. అది వెంటనే రాతపూర్వకంగా మార్చుతుంది. దీంతో కేసు నమోదు చేయడానికి ఇప్పటివరకు గంటల తరబడి సమయం పడితే.. ఈ ఏఐ కాప్‌రైటర్ క్షణాల్లోనే పని పూర్తి చేస్తుంది. ఫిర్యాదు రికార్డ్ చేసిన అధికారి వివరాలు, సమయం వంటి వివరాలన్నీ ఆటోమేటిక్‌గా పీడీఎఫ్ రూపంలో రికార్డ్ అవుతాయి. దీంతో రికార్డులను తారుమారు చేసే అవకాశం కూడా ఉండదని సీపీ సజ్జనార్ తెలిపారు. పోలీసులకు కూడా టైపింగ్ భారం తగ్గడమే కాకుండా.. రికార్డులను కూడా ఈజీగా మెయింటైన్ చేయవచ్చని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలవి**

## బ్లాక్ మెయిల్ రాజకీయాలు

**మంత్రి శ్రీధర్ బాబు ఫైర్**

**పెట్టుబడులు రాకుండా చేసేలా ప్రకటనలు**

**కాంగ్రెస్ అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేస్తోన్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతోన్న బీఆర్ఎస్ నాయకులు బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తెరలేపిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్ బాబు ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచే విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు.. అదే ప్రధాన అంశంగా మందుకు వెళ్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడుల వరద కొనసాగుతోందన్నారు. కానీ హరీశ్ రావు వ్యాఖ్యలతో విదేశీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు వేసే ప్రమాదం లేకపోలేదన్నారు.అసలు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా వద్దా హరీశ్ రావు చెప్పాలన్నారు. యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంటే బీఆర్ఎస్ మాత్రం అడ్డుకోవాలని చూస్తోందన్నారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. శంషాబాద్ కు మెట్రో విస్తరించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంటే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలోనూ నష్టం చేస్తారా? మూసీ ప్రక్షాళన చేయాలని తాము ప్రయత్నిస్తే బీఆర్ఎస్ దాని మిత్రపక్షం బీజేపీ అడ్డగోలుగా మాట్లాడుతూ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని శ్రీధర్ బాబు ఆరోపించారు. ప్రతిపక్షాల ఆటంకాలతో ప్రజలకు నష్టం అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు క్షమించరన్నారు. పరిశ్రమలు రాకుండా పెట్టుబడులు రాకుండా చేసేలా ప్రకటనలు చేస్తే తెలంగాణ యువతకు భారీ నష్టం చేసిన వారవుతారన్నారు. ప్రభుత్వంలో ఉండగా పదేళ్లు యువతకు నష్టం చేశారు. ఇప్పుడు ప్రతిపక్షంలో కూడా నష్టం చేస్తామంటే ప్రజలు సహించరన్నారు.

**హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో**

## సర్కార్ స్కూళ్లు బలోపేతం



**విద్యాభివృద్ధికి ముందుకొచ్చిన రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్‌లు**

**సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యాభివృద్ధికి రహేజా గ్రూప్, రామ్‌కీ ఫౌండేషన్, యశోద ఫౌండేషన్‌లు ముందుకొచ్చాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద ముందు కొచ్చిన ఈ సంస్థలు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందాలు చేసుకున్నాయి. శనివారం రాష్ట్ర సచివాలయంలో సీఎంతో జరిగిన సమావేశంలో రహేజా గ్రూప్ అధ్యక్షుడు నీల్ సి. రహేజా, రామ్‌కీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లా దాక్షాయణి, యశోదా గ్రూప్ డైరెక్టర్ గోరుకంటి దేవేందర్ రావు విద్యా శాఖతో కుదిరిన ఒప్పందాలను సీఎం సమక్షంలో పరస్పరం అంద జేసుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతి గదుల కోసం కొత్త ప్రాంగణ నిర్మాణానికి అయ్యే ఖర్చులో 40 శాతం మేరకు (రూ. 19.66 కోట్లు) వెచ్చించడానికి రాంకీ సంస్థ ముందు కొచ్చింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జెడ్పీహెచ్ఎస్ ఉన్నతీకరణలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి ఐదవ తరగతి, ఇంటర్ తరగతి గదుల నిర్మాణం కోసం మొత్తం వ్యయంలో 40 శాతం (రూ. 10.4 కోట్లు) ఖర్చు చేయడానికి రాంకీ సంస్థ ఒప్పందం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో ప్రీ–ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు తరగతి గదుల నిర్మాణం కోసం అవసరమైన రూ. 50.50 కోట్లు రహేజా గ్రూప్ ఖర్చు చేయడానికి ముందుకొచ్చి ఒప్పందం చేసుకుంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ సుభాష్‌నగర్ ఎంపిపీఎస్ లో ప్రీ–ప్రైమరీ, 6వ, 7వ తరగతి గదుల కోసం అవసరమైన రూ. 12.20 కోట్లు యశోదా హాస్పటల్స్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యాభివృద్ధి ముందుకొచ్చిన సంస్థలను సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 24.05.2026
www.mudranews.in | @mudranews



### బోన్ క్యాన్సర్ : ఎముకల బలాన్ని పర్యవేక్షించండి

చిన్న దెబ్బలకే లేదా సాధారణంగా నడుస్తున్నప్పుడు కూడా ఎముకలు విరిగిపోతుంటే (ఫ్రాక్చర్స్) వెంటనే అలర్ట్ అవ్వాలి. క్యాన్సర్ కణాలు ఎముకలను లోపల నుంచి గుల్లగా మారుస్తాయి కాబట్టి, ఎముకల బలహీనతను వెంటనే గుర్తించాలి.



# స్కందపురాణం ఎలుగెత్తి చాటిన క్షేత్రం కాళేశ్వరం

త్రిలింగ క్షేత్రాలలో ఒకటైన కాళేశ్వరం తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవ్‌పూర్ మండలంలో ఉన్న ఒక ప్రాచీన ఆధ్యాత్మిక క్షేత్రం. కాంధపురాణంలో కాళేశ్వరం క్షేత్రాన్ని వర్ణిస్తూ కాళేశ్వర ఖండం అనే చాప్టర్ ఉందంటే దీని ప్రాచీన విశిష్టతను అర్థం చేసుకోవచ్చు. ఘనమైన అరణ్య ప్రాంతం మధ్య, జీవనది గోదావరి మరియు దాని ఉపనది ప్రాణహిత సంఘమ స్థానంలో విరాజిల్లుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉండటం వలన ఈ ప్రాంతానికి ప్రత్యేక భౌగోళిక ప్రాధాన్యం ఏర్పడింది.

కాళేశ్వరం హైదరాబాద్‌కు సుమారు 277 కి.మీ. దూరంలో, భూపాలపల్లి పట్టణానికి సుమారు 53 కి.మీ. దూరంలో ఉంది. ఇది కరీంనగర్–మంథని మార్గం ద్వారా మరియు వరంగల్–పరకాల మార్గం ద్వారా రహదారి సౌకర్యాలతో అనుసంధానమై ఉంది. సమీప రైల్వే స్టేషన్ మంచిర్యాల, ఇది కాజీపేట–రామగుండం రైల్వే మార్గంలో సుమారు 70 కి.మీ. దూరంలో ఉంది. కాళేశ్వరానికి హిందూ పురాణాలలో విశిష్టమైన స్థానం ఉంది. స్కంద పురాణంలోని కాళేశ్వర ఖండం ఈ పుణ్యక్షేత్ర మహిమను, పవిత్రతను విశదీకరిస్తుంది.

పురాణాల ప్రకారం, త్రేతాయుగంలో శ్రీరాముడు దండకారణ్యంలో వనవాసం చేస్తున్న సమయంలో ఈ ప్రాంతం గుండా ప్రయాణించినట్లు రామాయణం పేర్కొంటుంది. ఈ ప్రాంత పరిసరాలలోని ప్రాచీన శ్రీ రామాలయాలు ఆ విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయి.

గోదావరి నది ఎడమ తీరంలో, గోదావరి–ప్రాణహిత సంగమస్థలంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం పురాణ కాలం నుండి పేరుగాంచింది. భక్తుల విశ్వాసం ప్రకారం, అంతర్వాహినిగా సరస్వతి నది ఇక్కడ భూగర్భంలో ప్రవహిస్తుందని చెబుతారు. అందువల్ల ఈ సంగమాన్ని 'దక్షిణ త్రివేణి సంగమం' లేదా 'దక్షిణ కాశి'గా పిలుస్తారు.





స్కంద పురాణం ప్రకారం, యమధర్మరాజు (కాలుడు) దక్షిణ దిక్కుకు అధిపతిగా, అష్టదిక్పాలకులలో ఒకరిగా ఈ పవిత్ర క్షేత్రంలో పరమశివుని ఆరాధిస్తూ ఘోర తపస్సు చేశాడని పురాణ గాధ. ఆయన భక్తికి ప్రసన్నుడైన పరమశివుడు, తనతో పాటు నిత్యం ఇక్కడే నివసించే వరాన్ని యమునికి అనుగ్రహించాడు. అందుచేత ఈ దేవాలయంలో ఒకే పానవట్టంపై కాళేశ్వర మరియు ముక్తీశ్వర అనే రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడ్డాయి.ఈ స్వామిని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిగా ఆరాధిస్తారు. ఇది కాలం (మరణం) మరియు మోక్షం (విముక్తి)లకు ప్రతీకగా భావించబడుతుంది. తెలుగు రాష్ట్రాలలో కాలేశ్వరుడిగా శివలింగ రూపంలో పరమశివునితో కలిసి ఆరాధించబడుతున్న ఏకైక ఆలయం ఇదేనని విశ్వసిస్తారు. యముడు 'కాలుడు'అనే పేరుతో ఇక్కడ లింగరూపంలో కొలువై ఉండటంతో ఈ క్షేత్రానికి 'కాళేశ్వరం'అనే పేరు ఏర్పడింది.

ఇక్కడి శివలింగాలలో ఒకదానిపై రెండు చిన్న రంధ్రాలు ఉంటాయి. వీటిని స్వామివారి "నాసికా రంధ్రాలు"గా భావిస్తారు. ఈ రంధ్రాలలో పోసిన పాలు లేదా నీరు గోదావరి నదిలో కలుస్తాయని స్థానిక విశ్వాసం. కాళేశ్వరం గోదావరి నదీ తీరంలో అష్ట తీర్థాలు ఉన్నాయి. అవి బ్రహ్మ తీర్థం, పిచ్చుక తీర్థం, జ్ఞాన తీర్థం, వాయస తీర్థం, సంగమ తీర్థం, నరసింహ తీర్థం, హనుమత్ తీర్థం, వ్యాస తీర్థం. ముఖ్యమైన పుణ్యకాలాల్లో మరియు హిందూ పండుగల సందర్భంగా వేలాది మంది భక్తులు ఇక్కడ పవిత్ర స్నానాలు ఆచరిస్తారు.

కాళేశ్వరం పరిసర ప్రాంతాలలోని దేవాలయాల నిర్మాణం, పునర్నిర్మాణాలకు కాకతీయ పాలకులు చేసిన సేవలను అనేక శాసనాలు తెలియజేస్తున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి చెందిన దేవరాయల 1397 శాసనం ప్రకారం, ఆయన కాళేశ్వరంలో దిగ్విజయోత్సవాన్ని నిర్వహించి తులాపురుష దానం చేసినట్లు పేర్కొనబడింది. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1976లో పునరుద్ధరించింది. ఆలయ ప్రాచీనతను, అసలు శివలింగాల పవిత్రతను కాపాడుతూ ఈ పనులు నిర్వహించబడతాయి. అనంతరం 1982లో శృంగేరి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వాములు ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. కాళేశ్వరం తన విశిష్ట శిల్ప సంపదకు కూడా ప్రసిద్ధి చెందింది. గోదావరి నది దక్షిణ తీరంలో ఉన్న ధర్మపురి, కోటిలింగాల, మంథని వంటి చారిత్రక, పవిత్ర ప్రాంతాలు కాళేశ్వరానికి సమీపంలో ఉన్నాయి. ముఖ్యంగా హిందూ పండుగల సమయంలో ఈ ప్రాంతాలు భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి.

కాళేశ్వరం ఆధ్యాత్మికత, పురాణ ప్రాశస్త్యం, చరిత్ర, శిల్పకళ, ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా నిలుస్తోంది. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి క్షేత్రం, గోదావరి తీరం మీద శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను, సాంస్కృతిక వారసత్వాన్ని నేటికీ కాపాడుతూ భక్తులను, పర్యాటకులను ఆకర్షిస్తోంది.

- కేదారి ప్రవీణ్ కుమార్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్
9490299526

## భూదాన్ భూముల బాధితులకు న్యాయం చేయాలి

**- ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్**



ముద్ర కూకట్‌పల్లి :

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని ఆచార్య వినోబాభావే పురం ఏవీబీపురంతో పాటు భూదాన్ బోర్డుకు సంబంధించిన స్థలాలను మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్థానిక ప్రజలతో కలిసి భూదాన్ భూముల సమస్యలను ఎంపీకి వివరించారు.భూదాన్ బోర్డుకు సంబంధించిన భూములను పేద, మధ్యతరగతి ప్రజలకు అమ్మి కొందరు సొమ్ము చేసుకున్నారని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. తీరా ఇప్పుడు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తుంటే, అవి ఐడిపిఎల్ కు చెందిన భూములంటూ ఐడిపిఎల్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించిన డబ్బులు చెల్లించి తాము దారుణంగా మోసపోయామని బాధితులు ఎంపీ వద్ద కన్నీటిపర్యంతమయ్యారు.బాధితుల సమస్యలను విన్న అనంతరం ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో సుమారు 26.6 ఎకరాల భూదాన్ భూమి ఉందని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి కొందరు తప్పుడు హామీలతో మోసం చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్థానిక దళితులు, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమస్యను త్వరలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఉన్నా ప్రభుత్వాలు జోక్యం చేసుకుని పేదలకు అండగా నిలవాలన్నారు. అనంతరం దళితులు, స్థానిక ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, దళిత సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### హైదరాబాద్ నడిబొడ్డున
## 'అన్నగారి' నిలువెత్తు విగ్రహం

*** మే 28న ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**
*** అమీర్‌పేట మైత్రీవనం కూడలికి 'ఎన్టీఆర్ సర్కిల్' నామకరణం**
*** కొత్తపేటలో రూపుదిద్దుకున్న 13 అడుగుల కాంస్య విగ్రహం**





**ముద్ర, హైదరాబాద్:** తెలుగుజాతి ఖ్యాతిని దశదిశలా చాటిన విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, యుగ పురుషుడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అపూర్వ నివాళి అర్పిస్తోంది. హైదరాబాద్ నడిబొడ్డున అన్నగారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సర్వాంగ సుందరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 28న (ఎన్టీఆర్ జయంతి) అమీర్‌పేటలోని మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం.

**23 అడుగుల ఎత్తులో సజీవ రూపం..**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి, కళారత్న డి. రాజ్‌కుమార్ ఉడయార్ రెండు నెలల పాటు శ్రమించి ఈ అద్భుత కాంస్య విగ్రహానికి తీర్చిదిద్దారు.

# సరస్వతి అంత్య పుష్కరాల్లో భక్తుల సందడి..

**- కాళేశ్వరం ఆధ్యాత్మిక కాంతులతో కళకళ**

**మహదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమం భక్తజన సందోహంతో కళకళలాడుతోంది. మూడవ రోజు నుంచే భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతుండగా, మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ముగించుకున్న అనంతరం భక్తులు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయంను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు ఉచిత షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంచడంతో భక్తులు సులభంగా ఘాట్లకు చేరుకుంటున్నారు. ఎండ తీవ్రతను తగ్గించేందుకు చలువ పందిళ్లు, మిస్ట్ ఫాగ్ స్ప్రింక్లర్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

పుష్కరాల సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి కల్యాణం, ప్రత్యేక హోమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సరస్వతి ఘాట్ వద్ద ప్రతి సాయంత్రం జరిగే "సరస్వతి నవరత్న మాలా హారతి" ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. హారతి అనంతరం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, పండితుల ప్రవచనాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేస్తున్న స్వామీజీల ధార్మిక సందేశాలు పుష్కరాలకు మరింత వైభవాన్ని తెస్తున్నాయి.

ఇదిలా ఉండగా, నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర్ ఆచార్య సంవిదానంద సరస్వతి మహారాజ్ కాళేశ్వరాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి నదిలో పుణ్యస్నానం అనంతరం ఆలయానికి చేరుకున్న మహారాజ్‌కు అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





పుష్కర భక్తులను మరోవైపు ఆకర్షిస్తున్నది కాళేశ్వరం మ్యూజియం. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి, రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల ప్రారంభించిన ఈ మ్యూజియం ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయుల కాలానికి చెందిన శిల్ప సంపదను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. విష్ణుమూర్తి దశావతార శిల్పాలు, చతుర్ముఖ లింగం, అన్నపూర్ణాదేవి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మ్యూజియం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు చారిత్రక అవగాహనను కూడా పొందుతున్నారు. కాళేశ్వరం ఆధ్యాత్మికత, చరిత్ర, శిల్పకళ, ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ పుష్కర వేడుకలకు మరింత మహిమను తీసుకువస్తోంది.

## గుంపు మేస్త్రీ హఠావో.... తెలంగాణ బచావో

**-గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు ఆగం**
**ఇందిరాపార్క్ వద్ద సెంట్రింగ్ కార్మికుల ధర్నాలో టీఆర్ఎస్ చీఫ్ కవిత**



**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన ధర్నాకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. కార్మికులతో చర్చించి రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. లేదంటే సమస్యలు తీర్చే వరకు తాను కూడా ధర్నాలో పాల్గొంటానని స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికులు ఈఎస్ఐ కార్డులు, కూలీ పెంపు, ప్రమాద బీమా, మరణ పరిహారం పెంపు వంటి 12 డిమాండ్లతో ఆందోళన చేస్తున్నారని కవిత తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో కీలకమని, ప్రాణాలకు తెగించి పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆరోపించిన కవిత.. "గుంపు మేస్త్రీ హఠావో.. తెలంగాణ బచావో" అనే నినాదాన్ని ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే సెంట్రింగ్ కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## ఈ నెల 28న బక్రీద్ సెలవు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** త్యాగాల ప్రతీక బక్రీద్ పండగ సెలవుదినాన్ని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాత క్యాలెండర్ ప్రకారం ఈ నెల 27న ఇవ్వాల్సిన బక్రీద్ సెలవును ఈ నెల 28కు మారుస్తూ శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం ఈ మార్పును ఖరారు చేసింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881 ప్రకారం మే 28వ తేదీని సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పేరుతో ఉత్తర్వులు విడుదలయ్యాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులకు ఈ మార్పు వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

## గుర్తించిన ఘాట్ల వద్దనే స్నానాలు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**మహదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్ల వద్దకు భారీగా తరలివస్తున్న భక్తులు తప్పనిసరిగా గుర్తించిన ఘాట్ల వద్దనే పవిత్ర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ . అనధికారికంగా గుర్తించని ఇతర ప్రాంతాల్లో స్నానాలు చేయడం ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. నదిలో ప్రవాహం, లోతు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని అధికారులు పుష్కర ఘాట్లను గుర్తించి సూచికలు ఏర్పాటు చేశారన్నారు. ఘాట్ల వద్ద రక్షణ సిబ్బంది, ఈతగాళ్లు, వైద్య సిబ్బంది, అవసరమైన ఏర్పాట్లు చేయబడ్డాయని తెలిపారు. భక్తులు క్రమశిక్షణతో వ్యవహరించి, అధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సురక్షితంగా పుష్కర స్నానాలు ఆచరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం లెక్కింపు

**34 రోజుల్లో రూ.1.8 కోట్ల ఆదాయం...**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న దేవాలయంలో శనివారం ఆలయ అధికారులు హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య ఆలయం ఉండి ఆదాయాన్ని లెక్కించగా, గడిచిన 34 రోజులలో రూ.1,08,64,164 ఆదాయం సమకూరినట్లు ఈవో వెల్లడించారు. ఈ ఉండే లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓ హరిహర్నాథ్, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజమౌళి, ఉపప్రధాన అర్చక మారుతి ప్రసాద్, సూపరెండేంట్ చంద్రశేఖర్, ధర్మేందర్, శ్రీనివాస్ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, ఏఎస్సై శ్రీనివాస్, మహిళ కానిస్టేబుల్ లు హోమ్ గార్డ్ లు, తిరుపతి అన్నమయ్య సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌టెల్ 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్' సేవలు ప్రారంభం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశంలోనే తొలిసారిగా 5G స్లైసింగ్ టెక్నాలజీ ఆధారంగా 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్' సేవలను ఎయిర్ టెల్ ప్రారంభించింది. ఈ సేవ ద్వారా పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు మరింత స్థిరమైన, వేగవంతమైన, అంతరాయం లేని నెట్‌వర్క్ అనుభవాన్ని అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. అధిక ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో కూడా మెరుగైన కనెక్టివిటీ అందేలా 5G నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపింది. ఉద్యోగ అవసరాలు, వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ మీటింగ్స్, క్యాబ్ బుకింగ్ వంటి సేవల కోసం నిరంతర ఇంటర్నెట్‌పై ఆధారపడే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ సేవను రూపొందించినట్లు సంస్థ పేర్కొంది. 'ప్రయారిటీ పోస్ట్‌పెయిడ్' సేవ ప్రస్తుతం ఉన్న అన్ని పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఆటోమేటిక్‌గా అందుబాటులోకి రానుంది.రూ.449 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్లాన్లలో అపరిమిత కాలింగ్, డేటా, ఎస్ఎంఎస్ లతో పాటు అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్, ఆపిల్ మ్యూజిక్, ఆపిల్ టీవీ వంటి అదనపు ప్రయోజనాలు కూడా లభించనున్నాయి. 5G SA సపోర్ట్ ఉన్న స్మార్ట్‌ఫోన్లలో తాజా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌తో ఈ సేవలను వినియోగించుకోవచ్చని ఎయిర్‌టెల్ తెలిపింది.

## బిగ్ టీవీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీసీ సంఘాలు



**ముద్ర , హైదరాబాద్ :** హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తాలో శనివారం పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌పై బిగ్ టీవీ ప్రసారం చేసిన అసత్య కథనాలను ఖండిస్తూ బీసీ సంఘాలు, కుల సంఘాలు, యువజన, మహిళా సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బిగ్ టీవీ యాజమాన్యం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీసీలను రాజకీయంగా ఎదగకుండా అగ్రకుల మీడియా కుట్రలు చేస్తోందని నేతలు ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడిపై వ్యక్తిత్వ హననానికి పాల్పడిన బిగ్ టీవీ యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బిగ్ టీవీని బ్యాన్ చేయాలని కూడా వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కో–చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్‌తో పాటు కుందారం గణేష్ చారి, గుజ్జ కృష్ణ, తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 24-05-2026
www.mudranews.in | @mudranews



## బోన్ క్యాన్సర్
### శారీరక మార్పులపై శ్రద్ధ పెట్టండి

ఎలాంటి కారణం లేకుండా హఠాత్తుగా బరువు తగ్గిపోవడం మరియు విపరీతమైన అలసటకు గురికావడం వంటి లక్షణాలను తేలికగా తీసుకోకండి. రాత్రి పూట జ్వరం రావడం లేదా ఎక్కువగా చెమటలు పట్టడం వంటి ఇతర లక్షణాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి.

## సైబర్ నేరగాళ్లపై పోలీసుల ఉక్కుపాదం

**ముద్ర, మల్కాజ్ గిరి:** మల్కాజ్‌గిరి పోలీ స్ కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ పోలీసులు గత వారం రోజులలో ఐదు ప్రధాన సైబర్ మో సాల కేసులను ఛేదించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మే 17 నుంచి 23 వరకు నిర్వహించిన ప్రత్యేక దర్యాప్తులో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, అనధికార బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన కేసులను వెలుగులోకి తెచ్చారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. అరెస్టైన నిందితులు సైబర్ నేరగాళ్లకు మ్యూల్ అకౌంట్లు అందిస్తూ దేశవ్యాప్తంగా మోసాలకు సహకరిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసుల్లో భాగంగా గౌరవ న్యాయస్థానం ద్వారా రూ.23.30 లక్షలు రికవరీ చేసి బాధితులకు తిరిగి అందజేశారు. డిజిటల్ అరెస్ట్ కేసులో సీబీఐ, పోలీస్ అధికారులమని నమ్మబలికి ఓ బాధితుడి నుంచి రూ.1.66 కోట్లు కాజేసిన ఘటనను పోలీసులు ఛేదించారు. మరో కేసులో నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ వెబ్‌సైట్ల ద్వారా భారీ లాభాలు వస్తాయని నమ్మబలికి కోట్ల రూపాయలు మోసం చేసినట్లు వెల్లడించారు. టెలిగ్రామ్, గోల్డ్ ట్రేడింగ్, బిట్‌కాయిన్ పెట్టుబడుల పేర్లతో కూడా మోసాలు జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడులను నమ్మవద్దని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ముద్ర కాప్రా:** కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాలు పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఎంతో దోహదపడుతున్నాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్‌లోని వీఎన్ ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప్పల్ మండలానికి చెందిన 233 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తులం బంగారం కూడా అందించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో పూల్ సింగ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జన గణనకు అందరూ సహకరించాలి
### - జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్

**ముద్ర, శేరిలింగంపల్లి:** సెంట్రల్ సెన్సస్ బృందంతో శేరిలింగంప్లి జోనల్ కమిషనర్, మరియు డిప్యూటీ కమిషనర్ కలిసి ఖాజాగూడలోని ప్రయివేటు అపార్ట్‌మెంట్‌ను సందర్శించారు. అపార్టుమెంట్ లో జరుగుతున్న జనగణన కార్యకలాపాలను సమీక్షించి, క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ప్రక్రియను పరిశీలించారు. జనగణన విజయవంతంగా అమలు కావడానికి ఖచ్చితమైన, పారదర్శకమైన, సమగ్రమైన డేటా సేకరణ ఆవశ్యకతను ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి నొక్కి చెప్పారు. ఇంటింటి సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి వారికి ఎదురవుతున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ జనగణన ప్రక్రియలో సహకరించి, సరైన సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన 'అరెకపూడి'




**ముద్ర, శేరిలింగంపల్లి:** ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.6 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.5.85 కోట్ల వ్యయంతో నల్లగండ్ల హుడా కాలనీలో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో రూ.25 లక్షలతో చేపట్టనున్న నల్లగండ్ల ఎస్సీ స్మశానవాటిక అభివృద్ధి, సుందరీకరణ పనులను ప్రారంభించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 102 సీసీ కెమెరాలను సీపీ రమేష్ రెడ్డి, డీసీపీ రితీరాజ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. కృష్ణసాయి ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.23 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిన్నారుల ఆటవిడుపు పరికరాలను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రీయ సాగుతో అధిక దిగుబడులే లక్ష్యం
### - ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అచ్చంపేట నియోజకవర్గం పదర మండల రైతు వేదికలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేతలు" కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు శాస్త్రీయ విధానాలను అనుసరించాలని సూచించారు. శాస్త్రవేతల సలహాలు, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని పంటల నాణ్యత పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రైతులకు పిలుపునిచ్చారు. విత్తనాల ఎంపిక, నేల పరీక్షలు, సమతుల ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, పురుగులు–తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతు సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మద్దిమడుగు దేవాలయం సమీపంలో ప్రమాదానికి గురైన షాపుల యజమానులకు ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహార చెక్కులను అందజేశారు.

## భావితరాలకు భవిష్యత్ ప్రణాళికలు
### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

యువత భవిష్యత్తు అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, కానీ కల్వకుంట్ల కుటుంబం తమ కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లు అందజేసి, వివిధ క్రీడల్లో విజేతలైన క్రీడాకారులను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ ఐటీఐ సెంటర్లు, జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతోందన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య అంది స్తున్నామని తెలిపారు. "తెలంగాణ రైజింగ్ విజన్–2047" లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు.

హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా "భారత్ ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తూ లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. స్థానిక యువతకు రాష్ట్రంలోనే ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రేవంత్ సర్కార్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డివైఎస్ఓ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ ఎంపీ ప్రవీణ్ కుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు యువత భవిష్యత్తుకు బలమైన పునాది
### - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

యువత క్రీడలను జీవితంలో భాగంగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు నిర్వహించిన యువత క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన అలవాటు చేసుకోవడంలో ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడా సంస్కృతి పెరుగుతుండటం ఆనందకరమని, జిల్లాకు చెందిన యువత రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఓటమిని విజయానికి తొలి మెట్టుగా భావించి మరింత కృషి చేయాలని యువతకు సూచించారు.

అనంతరం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ ఆవిష్కరించి పంపిణీ చేశారు. యువతను క్రీడలు, ఆరోగ్యకర జీవనశైలి, సామాజిక బాధ్యతల వైపు మళ్లించే కార్యక్రమాలు నిరంతరం నిర్వ హించాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, జిల్లా టూరిజం అధికారి నరసింహ, డీఈఓ రమేష్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో యువతకు ఉపాధి బాట
### - 31 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత




**ముద్ర, నారాయణపేట:**

యువతలోని ప్రతిభను గుర్తించి వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రి యాంక అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నారాయణపేట జిల్లాకు చెందిన 31మంది యువతీ యువ కులకు ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ నెల 1న మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులకు ఆర్డర్ కాపీలు అందించి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యం త్రాంగం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తోం దని తెలిపారు.


### ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్

ఉట్కూర్ మండల కేంద్ర సమీపంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు హాజరై ఎండ తీవ్రత పెరగకముందే తిరిగి వెళ్లాలని సూచించారు. కూలీలకు తాగు నీరు, కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సం దర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలోని వల్లంపల్లి, బిజ్వార్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య తక్కువగా ఉందని, సోమవారం నుంచి మరింత మందిని పనులకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓకు సూచించారు.

### ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలి

మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామ సమీపంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసా య శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కలె క్టర్ రైతులు వరి, పత్తి పంటలతో పాటు కూరగాయలు, ఆయిల్ ఫామ్, పండ్లతోట ల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపడం శుభపరిణామమన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రభు త్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం
### - పాల్గొన్న 530 మంది క్రీడాకారులు




**ముద్ర, కూకట్‌పల్లి:**

వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎస్ ఎల్ వి ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో 530 మంది క్రీడాకారులు నమోదు చేసుకోవడం విశేషమన్నారు. జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల యువతలో పెరుగుతున్న ఆసక్తికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామరాజు, సాయితేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా సత్కరించింది.

ఈ కార్యక్రమానికి అధికారులు, కోచ్‌లు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



## జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో పోలీసులకు వార్షిక వైద్య శిబిరం

**ముద్ర, కూకట్‌పల్లి:** పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్ లో శనివారం ఉచిత వార్షిక వైద్య శిబిరం నిర్వహించారు. సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డా. ఎం. రమేష్, కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ సంయుక్తంగా ఏర్పాటు చేశారు.

ఈ శిబిరంలో కేపీహెచ్‌బీ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన సుమారు 90 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య నిపుణులు బీపీ, షుగర్, ఈసీజీ, రక్తపరీక్షలు, బాడీ మాస్ ఇండెక్స్, నేత్ర పరీక్షలు తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింధు హాస్పిటల్ వైద్య బృందం, స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శిల్పారామంలో ముగిసిన సమ్మర్ ఆర్ట్ క్యాంపు

**ముద్ర, శేరిలింగంపల్లి:** శిల్పారామం మాదాపూర్‌లో గత 15 రోజులుగా నిర్వహించిన సమ్మర్ ఆర్ట్ క్యాంపు శనివారంతో ముగిసింది. క్యాంపులో శిక్షణ పొందిన పిల్లలు, పెద్దలు తయారు చేసిన మట్టి కుండలు, పెన్సిల్ స్కెచ్‌లు, క్లే టాయ్స్, పటచిత్ర, యాక్రిలిక్, మధుబని పెయింటింగ్‌లు, వాటర్ కలర్స్, సీషెల్ క్రాఫ్ట్సును ప్రదర్శనశాలలో ఏర్పాటు చేశారు. సందర్శకులు కళాఖండాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన గురువులను సన్మానించి, పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## అలరించిన భరణి శిష్య బృందం కూచిపూడి ప్రదర్శన

సాంస్కృతిక కార్యక్రమాల్లో బెంగళూరుకు చెందిన కుమారి నిత్యశ్రీ భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆమె షడక్షర కౌతం, వెంకటాచల నిలయం, శివస్తుతి, భజన, తిల్లాన అంశాలను ప్రదర్శించారు. అలాగే డాక్టర్ అడపా భరణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించింది. కొలువైతే గణపతిమ్, హంసధ్వని జతిస్వరం, భూపాళం తిల్లాన, మాతే మలయధ్వజ, ప్రహ్లాద శబ్దం, శివపంచాక్షరి అంశాలను కళాకారులు సాద్విక, ధాత్రి, సంయుక్త, జాన్వీ, రామహృదయ, రాజేశ్వరి, హాసిని, కీర్తన, నియతి, రఘునందిని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

## పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన వీరశైవ సమాజం సభ్యులు


**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన వీరశైవ సమాజం నూతన కమిటీ సభ్యులు శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డిను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వీరశైవ సమాజ అధ్యక్షుడు తంబాకు శేఖర్‌తో పాటు కమిటీ సభ్యులు మహేందర్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. సమాజ అభివృద్ధి కోసం తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పట్నం మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. వీరశైవ సమాజ కమిటీ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గూలి పరమేశ్వర్, వైస్ ప్రెసిడెంట్ శెట్టి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు గౌరీ శంకర్, మద్రిక చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 24.05.2026
www.mudranews.in | @mudranews



**బోన్ క్యాన్సర్:**



వయసును బట్టి వచ్చే రకాలపై అవగాహన ఆస్టియోసార్కోమా, ఎవిం గ్స్ సార్కోమా వంటివి పిల్లలు, యువకులలో వచ్చే ప్రమాదం ఉంది. వయసు పైబ డిన వారి లో కాండ్రోసార్కోమా వంటి రకాలు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి.

# మహిళా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

## - ప్రజా ప్రభుత్వ లక్ష్యాలపై విస్తృత అవగాహన కల్పించాలి

## - కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా




**ముద్ర, కరీంనగర్:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం మహిళా, శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికా రులతో మహిళా వారోత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా వారోత్సవాల సందర్భంగా రోజూ వారీగా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వ హించాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెల 25న పోషకాహార మిషన్ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. సే నో టూ జంక్ ఫుడ్ పై అవగాహన, వంటల పోటీలతో పాటు గర్భిణులకు రక్తహీనత పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డులలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. 26 న బాల్య వివాహాల నిర్మూలన తెలంగాణ లక్ష్యంగా బాల్య వివాహం – బతుకు ఆగం పేరుతో బాల్య వివాహాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోస్టర్లు, పాంప్లెట్లు, గోడలపై చిత్రలేఖనం, తదితర ప్రచార కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే గ్రామాలను గుర్తించి, మత పెద్దలు, కల్యాణ మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. 1098, 181 సేవలపై విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేసి వారికి పాస్ బుక్ లు అందజేసి సన్మానం చేయాలని ఆదేశించారు. ఈ నెల 27 న మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు, షీ టీమ్స్ సమన్వయం, కార్యాలయాల్లో పీఓఎస్ హెచ్ నిబంధనల అమలుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల సభ్యులకు లోన్ మేళా నిర్వహించాలన్నారు. ఈ నెల 29 న జిల్లాలో నూతన అంగన్వాడీ కేంద్రాలు, వీఓ భవనాలు, మెప్మా ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలో క్యాంటీన్ ప్రారంభించాలని సూచించారు. ఈ నెల 30 న అమ్మ మాట, అంగన్వాడీ బాట పేరుతో అంగన్వాడీ, బడిబాట కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల నిండిన పిల్లలకు ప్రాథమిక పాఠశాలకు పంపించడానికి సర్టిఫికెట్లు అందజేయాలని సూచించారు. అలాగే కొత్తగా అంగన్వాడీ కేంద్రాలకు కొత్త పిల్లల్ని చేర్చుకోవడం, పిల్లల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మెప్మా, పీడీ స్వరూప రాణి, డీ ఆర్ డీఏ పీడీ గీత, డీపీఓ జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసిన ఎంపీ

## - డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** పసుపు బోర్డు అని చెప్పి నిజామాబాద్ ఎంపీ అరవింద్ రైతులను మోసం చేశారని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆరోపించారు.

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్పైస్ బోర్డు తో రైతులకు లాభం లేదన్నారు. కేంద్రీయ విద్యాలయం స్థలం విషయంలో అనవసర రాద్ధాంతం అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పలు చోట్ల స్థలాలు పరిశీలించి విద్యార్థులకు అనుకూలంగా ఉన్న స్థలంను ఎంపిక చేస్తారన్నారు. మాజీ చైర్మన్ భోగ శ్రావణి హయాంలో జగిత్యాల మున్సిపల్ ను పూర్తిగా అవినీతిమయంగా మార్చారన్నారు. హైదరాబాద్ లో బిజినెస్ చేసుకుంటూ మెరుపు తీగ లాగ జగిత్యాలకు వచ్చి ఏదో మాట్లాడితే ప్రజలు నమ్మరన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. భోగ శ్రావణి మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు గా ఉందన్నారు. మాట అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు లో జగిత్యాల నియోజకవర్గం అని పెట్టకుండా చల్గల్ అని పెట్టి కావాలని విద్యార్థులను నాణ్యమైన చదువుకు ఎంపీ అరవింద్ దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థలం కేటాయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం కు ఉంటుందని, కాని చల్గల్ అని జీవో తేవడంలో రాజకీయ కోణం దాగుందన్నారు. కేంద్రీయ విద్యాలయంలో నాలుగు తరగతుల్లో 240 మంది విద్యార్థులకు ఉపయోగమన్నారు.

అందులో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కానీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ లో దాదాపు 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన బోధన, ఇతర వసతులు ఉంటాయన్నారు. చల్గల్ వాలంతరీ చాల విలువైన స్థలం కాబట్టే రెండేకరాలు కేటాయింపు చేశారన్నారు. ఇతర చోట్ల అనువైన స్థలం కూడా ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రతిపాదించారన్నారు. జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకులు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల ప్రజలు అడిగే ప్రశ్నల నుండి పారిపోయి హైదరాబాద్ లో ఉంటున్న భోగ శ్రావణి కుటుంబం చరిత్ర అందరికీ తెలుసని మండి పడ్డారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆద్వర్యం లో యావర్ రోడ్డు విస్తరణ అవుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ లు గిరి నాగభూషణం, అడువల జ్యోతి, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, జిల్లా యూత్ అధ్యక్షుడు బీరం రాజేష్, కౌన్సిలర్ లు, నాయకులు లక్ష్మణ్, ప్రవీణ్ రావు, పులి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయండి

## - కలెక్టర్ రాజర్షిషా



**బోథ్, ముద్ర:**

జొన్నల కొనుగోళ్ల పక్రియను వేగవంతం చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాలో జొన్నల కొనుగోళ్ల ప్రక్రియ, రవాణా ఏర్పాట్లపై గూగుల్ మీట్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన రవాణా సదుపాయాలు, గిడ్డంగుల ఏర్పాట్లను పక్కాగా పర్యవేక్షించాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ గూగుల్ మీట్ లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, మార్క్ ఫెడ్ డీఎం మహేష్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానన్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, డీసీఎస్ఓ నందిని, సివిల్ సప్లైస్ డీఎం సుధారాణి, డీసీఓ, పిన్ పాయింట్ అధికారులు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ సెక్రెటరీలు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జీలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## - ఎస్పీ అశోక్ కుమార్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో పోగొట్టుకున్న, చోరికి గురైన సుమారు రూ.23 లక్షల విలువగల 117 మొబైల్ ఫోన్లను బాధితులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్ సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు సీఈఐఆర్ వెబ్ సైట్ లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైళ్లను ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్ స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,67,60,000 లక్షల విలువగల 1,838 ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారం గురించి నష్టాన్ని కాజేస్తుందన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్లను నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ వెబ్ సైట్ లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఎవరైనా సెకండ్ హాండ్ ఫోన్ లు కొనే ముందు అప్లికేషన్లో ఐఎంఈఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలన్నారుఎవరికైనా సెల్ ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి అప్పగించాలన్నారు. సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్ స్పెక్టర్ సీఈఐఆర్ టీం ను ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు. అదనపు ఎస్పీ శ్రీచేతన్ నితిన్, సైబర్ క్రైమ్ ఎస్సై దినేష్, సీఈఐఆర్ టీం హెడ్ కానిస్టేబుల్ మహముద్, కానిస్టేబుల్ అజర్, అనూష, ప్రశాంత్ పాల్గొన్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే కు హెల్త్ కేర్ ఎక్సెలెన్స్ అవార్డు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** వైద్య రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు హెల్త్ కేర్ ఎక్సెలెన్స్ అవార్డు వచ్చింది. ఈ మేరకు శనివారం ప్రైవేట్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో హెల్త్ కేర్ ఎక్సలెన్స్– 2026 పేరుతో హైదరాబాద్ లో నిర్వహించిన అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లక్షకు పైగా మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించినందుకు గాను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

# క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుంది

## - అదనపు కలెక్టర్ రాజాగౌడ్




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయని అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్ పేర్కొన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ – ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం శనివారం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండోర్ మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెమెంటోలు బహుకరించారు. జాబ్ మేళా ద్వారా ఎంపికైన నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాల పత్రాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సి లర్లు అరవ లక్ష్మీ, దయాల చంద్రకళ శంకర్, బొల్లరపు స్వప్న గిరిధర్, పద్మ రాజేం దర్, యువజన, క్రీడల శాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం, ప్రైవేట్ కంపెనీల ప్రతిని ధులు, జిల్లా టాస్క్ మేనేజర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు

## - అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ సాధనపై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని నైపుణ్యాలను పెంపొందించుకుని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన 40 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. జాతీయ స్థాయి యువ దినోత్సవాల్లో పాల్గొన్న 'పాటే మా ప్రాణం' సంగీత అకాడమీ కళాకారులను, జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల విజేతలకు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ ఏడీ నరసింహారెడ్డి, ఐటీఐ ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

**ముద్ర, కోరుట్ల:**

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో శనివారం కోరుట్ల మండలంలోని పైడిమడుగు రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళా శాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బి. సౌజన్య మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత గురించి వివరించారు. యూరియా వాడకాన్ని తగ్గించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించడం, మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి. భూమేష్, ఏఈవో రాఘవేంద్ర, అభ్యుదయ రైతులు జనార్దన్, ఎస్. నర్సారెడ్డి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ నియామక పత్రాల అందజేత




**మహాదేవపూర్, ముద్ర:**

ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పలు కంపెనీల నుంచి ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ రాహుల్ శర్మ అందజేశారు. జిల్లా నుంచి 43 మందికి నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళికలో క్రీడా పోటీల్లో గెలుపొందిన 45 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యర్కియాలజీ డైరెక్టర్ బుజ్జి, సెక్యూరిటీ రాజు, సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 24.05.2026
www.mudranews.in | @mudranews



**బోన్ క్యాన్సర్ :** ఫిట్‌నెస్‌తో సంబంధం లేదని గ్రహించండిమనం ఎంత ఆరోగ్యంగా, యాక్టివ్‌గా ఉన్నా కూడా బోన్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని గుర్తుంచుకోండి. ఇది జీవనశైలి లోపాల కంటే జన్యుపరమైన మార్పుల వల్ల వచ్చే అవకాశం ఎక్కువ కాబట్టి క్రమం తప్పకుండా హెల్త్ చెకప్స్ చేయించుకోవాలి.



## టీయూడబ్ల్యూజే ఐజేయూలో చేరికలు



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయు)లో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ శనివారం విలీనం చేశారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాస్ రావు, కోల నాగేశ్వరరావు, డాక్టర్ కృష్ణ బంటు ఆధ్వర్యంలో వారి సంఘాన్ని ఐజేయూలో విలీనం చేసి సభ్యత్వం తీసుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి యాదగిరి తో పాటు మరికొందరు ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం టియుడబ్ల్యుజే ఐజేయు పాటుపడుతుందని, ప్రభుత్వం భవిష్యత్తులో తీసుకోబోయే జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అన్ని రకాల పథకాలను వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ వర్తించేలా చూస్తామన్నారు. తమ యూనియన్ లో (టీఎస్ జేఏ) సంఘాన్ని విలీనం చేసి సభ్యత్వం తీసుకోవడం స్వాగతిస్తున్నామని, వారందరికీ కూడా తగు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. తమ యూనియన్లో గుర్తింపు లభిస్తుంది అని తెలిపారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసి జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన ఉత్సాహవంతమైన జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవడం మంచి పరిణామం అని తెలిపారు. కష్టపడే జర్నలిస్టులకు మంచి అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టుల అందరి సంక్షేమం కోరుకొని ఈరోజు ప్రభుత్వ అనుబంధ యూనియన్ గా కొనసాగుతున్న సభ్యత్వాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు జర్నలిస్టుల సమస్యలను విన్నవించామని తెలిపారు.. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నైపుణ్యాలు ఉద్యోగావకాశాలను పెంచుతాయి

### అదనపు కలెక్టర్ భాస్కరరావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన వంటి నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను పెంచుతాయని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రావు అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణ ప్రణాళిక యువజన క్రీడల వారోత్సవాలలో "ఉద్యోగం సాధన కనెక్టింగ్ టాలెంట్ విత్ ఒప్పోర్ట్యూనిటీస్ సమీకృత కార్యాలయం కలెక్టరెట్ మీటింగ్ హాల్ , ఉద్యోగం సాధన అపోయింట్మెంట్ ఆర్డర్స్ / సర్టిఫికెట్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఎంతో ప్రతిభ ఉన్న యువత ఉంది కానీ చాలాసార్లు సరైన అవకాశాలు తెలియక వారు తమ ప్రతిభను పూర్తిగా చూపించలేకపోతున్నారని అన్నారు. మరోవైపు, అనేక సంస్థలు నైపుణ్యం కలిగిన వ్యక్తులను వెతుకుతున్నాయని ఈ రెండింటిని కలిపే వంతెనే "ఉద్యోగ సాధన". విద్య మాత్రమే కాకుండా, నైపుణ్యాభివృద్ధి కూడా ఈ రోజుల్లో చాలా అవసరమన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన వంటి నైపుణ్యాలు ఉద్యోగ అవకాశాలను పెంచుతాయని యువత తమ ప్రతిభను గుర్తించి, దానికి తగిన శిక్షణ పొందాలన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి కే. ధనంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ ప్రపంచం అభివృద్ధి చెందుతోందని ఆన్‌లైన్ జాబ్ పోర్టల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్స్ వంటి అవకాశాలు యువతకు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల యువత కూడా ఇప్పుడు ప్రపంచ స్థాయి అవకాశాలను అందుకోవచ్చని ఉద్యోగం అనేది కేవలం జీవనోపాధి మాత్రమే కాదు అది ఆత్మవిశ్వాసాన్ని పెంచే శక్తి. ఉద్యోగం ద్వారా వ్యక్తి కుటుంబానికి, సమాజానికి, దేశానికి సేవ చేయగలడని కాబట్టి యువత నిరాశపడకుండా తమ ప్రతిభను మెరుగుపరుచుకుని, వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సీఎం రాకతో ముందస్తు అరెస్ట్ లు






**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట అభివృద్ధి కార్యక్రమం లో భాగంగా శనివారం యాదగిరి గుట్టకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి రాక సందర్భంగా యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులను, అటు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ యాదగిరిగుట్ట నిరుద్యోగ ఉపాధి కోసం కొండపైన అవినీతి నిర్మూలనా కోసం దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా నిస్వార్థంతో పోరాడుతున్నటువంటి మమ్మల్ని ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ను కలిసి మా y గోడు విన్నవించుకుందామంటే ఈ విధంగా చేయడం బాధాకరం దేవస్థానం కొన్ని కోట్ల నష్టపోతున్న కూడా పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ ప్రభుత్వం మద్దతు పలకడం సిగ్గుచేటు. తక్షణం కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి దుకాణాలను టెండర్ ప్రక్రియ ద్వారా స్థానికులకు వచ్చే విధంగా చేయాలని కోరుతున్నాం అని అన్నారు. బి ఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ యాదగిరిగుట్టకు సీఎం రాకతో ముందుగా బీఆర్ఎస్ నాయకులను అక్రమ అరెస్టు చేశారు. అనంతరం మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఇబ్బందులు పెడుతున్నారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన అది ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఎందుకు అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యాదగిరిగుట్టకు సీఎంలు ఎంతోమంది వచ్చి పోయేవారు కానీ ఇలా అక్రమ అరెస్టులు చేయడం తగదన్నారు. ఈ అక్రమ అరెస్టులను ఖండించారు. అరెస్ట్ చేసిన వారి లో లో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, గ్యాదపాక బాల నరసయ్య,కల్వకొలను సతీష్, మాటూరు బాలయ్య, కర్రె ప్రవీణ్, బుగ్గా ఆంజనేయులు,బండి వాసు,బండి అనిల్, ముక్కెర్ల వెంకటేష్,నరసింహ, మిరియాల కృష్ణ,గోపగాని ప్రసాద్,కర్రె శ్యామ్, మందోజు నరేష్,కొన్నె సంజీవ, దొమ్మాట ప్రభాకర్,గుండు కుమార్, సుధాగాని శివ,పల్లపు రవి, వాల్మీకి అజయ్ , ఆవుల రాజు కౌన్సిలర్ పేరబోయిన సత్యనారాయణ పా పట్ల నరహరి ఆరే శ్రీధర్ బీర్ల మహేష్ బాబురావు ఉన్నారు.

# నృసింహుని సన్నిధిలో సీఎం రేవంత్ రెడ్డి

**యాదగిరిగుట్టలో సీఎం పర్యటన**
**టెంపుల్ సిటీ లో వేద పాఠశాలకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**స్వామివారిని దర్శించుకున్న సీఎం**





**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం యాదగిరి గుట్టలో పర్యటించారు. ఉదయం 8:50 నిమిషాలకు హెలికాప్టర్లో యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు కొండా సురేఖ ,కోమటిరెడ్డి వెంకటరెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ కి ప్రభుత్వ విప్ ఆలేర్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా స్వాగతం పలికారు హెలికాప్టర్ నుండి నేరుగా వెళ్లి టెంపుల్ సిటీలో 43 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వేద పాఠశాల పనులకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి తో కలిసి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. రూ. 100 కోట్ల తో చేపట్టనున్నరూ.43.80 కోట్లతో వేద పాఠశాలకు, రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణానికి ఆయన అక్కడే శంకుస్థాపన చేశారు. అనంతరం యాదగిరి కొండపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వయంభులను దర్శనం చేసుకున్న అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేపట్టారు. దేవస్థానం ఈవో భవాని ప్రసాద్ ధర్మకర్త నర్సింహమూర్తి లు సీఎం కి మంత్రులకు స్వామి వారి జ్ఞాపిక ను ప్రసాదాలను అందజేశారు. దర్శన అనంతరం 10.55 నిమిషాలకు హెలికాప్టర్ లో సీఎం హైదరాబాద్ కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల షామెల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ నెలికంటి సత్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర చైర్మన్ బంద్రు శోభారాణి, భువనగిరి యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్లు తంగళపల్లి శ్రీవాణి, గుండ్లపల్లి వాణి పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు అవసరం

**ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**జాబ్ మేళాలో ఎంపికైన 618 మంది అభ్యర్థులకు ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు**



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఆరోగ్యకరమైన జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువజన, క్రీడల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా "ఉద్యోగ సాధన – కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమం జాబ్ మేళా క్రింద ఎంపికైన 618 మంది అభ్యర్థులకు జాబ్‌మేళా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే సీఎం కప్–2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన 72 మంది యువ క్రీడాకారులను సన్మానించారు. మొత్తం 433 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గతంలో సాధారణంగా కుటుంబాల్లో క్రీడలకు అంతగా ప్రోత్సాహం ఉండేది కాదని, ప్రస్తుతం సానియా మీర్జా, తిలక్ వర్మ వంటి యువత క్రీడల్లో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. ప్రస్తుతం క్రికెట్ మాత్రమే కాకుండా అనేక క్రీడల్లో యువత ప్రతిభ కనబరుస్తోందని, ఇటీవల ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అథ్లెటిక్స్ విభాగంలో కూడా పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోందని, ప్రముఖ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సుమారు 50 వేల కోట్ల సంపద సంపాదించి నప్పటికీ ఆరోగ్య సమస్యలతో చిన్న వయసులోనే మరణించారని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాను అన్ని చోట్ల పెట్టుబడులు పెట్టానని, కానీ ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టలేదని ఆయన చెప్పిన మాటలను గుర్తు చేశారు. సంపద కంటే ఆరోగ్యం ముఖ్యమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా క్రీడలు అందిస్తాయని అన్నారు.ఖమ్మం జిల్లా క్రీడల్లో ఎప్పుడూ ముందంజ లో ఉంటుందని, ఇక్కడ మంచి మౌళిక వసతులు ఉన్నాయని, కోచ్‌లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. క్రీడల్లో విజయాలు సాధించాలంటే శరీరాన్ని దేవాలయంలా భావించి సరైన పోషకాహారం తీసుకోవాలని గాయాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టితే దీర్ఘకాలం క్రీడల్లో కొనసాగవచ్చని సూచించారు.ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, కొందరికి మేధస్సు, కొందరికి సంగీతం, నృత్యం, మరికొందరికి క్రీడల్లో ప్రతిభ ఉంటుందని, వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని యువతకు సూచించారు.ఉద్యోగాలు సాధించిన యువతకు ఇది మొదటి అడుగు మాత్రమేనని, కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్న స్థాయి ఉద్యోగంతో ప్రారంభించి ప్రస్తుతం మంచి స్థాయికి ఎదిగిన యువత ఉదాహరణలు తమకు తెలిసి ఉన్నాయని, కృషి, పట్టుదలతో మంచి భవిష్యత్తు సాధించవచ్చని యువతకు ప్రోత్సాహం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పంట అవశేషాలను కాల్చొద్దు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి, రైతుల ఆర్థిక పరిస్థితికి నష్టం కలుగుతుందని, పంట అవశేషాలను కాల్చవద్దని ఖమ్మం జిల్లాలో పంట కోత అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చినపుడు హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని, దీని వల్ల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని, దీని ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుందని చెప్పారు. రైతులు పర్యావరణాన్ని కాపాడే విధంగా వ్యవహరించి, పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్ ద్వారా నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులు అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని తెలిపారు.

# సంచలనం సృష్టించిన యువకుడి హత్య

**ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ నరసింహ**
**హంతకులను పట్టుకోవడానికి 5 ప్రత్యేక పోలీసు బృందాలు**
**పిడి యాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తాం, బెయిల్ లభించకుండా చేస్తాం**



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** హత్యకు గురైన ఏర్కారం గ్రామానికి చెందిన మధు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఎస్పీ నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా మృతుని బంధువులతో మాట్లాడారు. హంతకులను త్వరగా పట్టుకుంటామని, కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తామని బంధువులకు హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి ఏర్కారం గ్రామ శివారులో రోడ్డు పక్కన కల్వర్టు కింద గోనె సంచీలో శవం ఉందన్న సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే మృతదేహాన్ని బయటికి తీశారు. గోన సంచిలో దొరికిన మృతదేహం ఎరకారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు గా గుర్తించి బంధువులను పిలిపించి నిర్ధారించారని ఎస్పీ తెలిపారు. కాగా చింతలపాటి మధు శుక్రవారం రోజు ఉదయం 11 గంటలకు ఇంట్లో నుంచి వెళ్ళాడని ఆచూకీ తెలియడం లేదని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్లో అతని భార్య ఫిర్యాదు చేసింది. మొదటగా ఈ ఫిర్యాదు పై మిస్సింగ్ కేస్ నమోదు చేసి, హత్య కేసుగా మార్పు చేయడం జరిగింది. ఈ కేసును సూర్యాపేట పట్టణ సీఐ దర్యాప్తు చేస్తున్నారని, డీఎస్పీ ప్రసన్నకుమార్ పర్యవేక్షిస్తున్నారని, నిందితులను పట్టుకోవడం కోసం 5 ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశామని, నిందితులను పట్టుకుని కఠిన శిక్షలు పడేలా త్వరితగతిన దర్యాప్తు చేస్తామన్నారు. నిందితులపై పీడీ యాక్ట్ పెట్టి బెయిల్ దొరకకుండా జైలులోనే ఉండేలా చేస్తామని అన్నారు. సంఘటనపై టెక్నికల్ ఆధారాలు సాక్షుల ఆధారాలు బలంగా నమోదు చేస్తామన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడుతూ భౌతిక దాడులు చేస్తూ హత్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు అమలవుతాయని పోలీసు అత్యంత వేగంగా కేసులు దర్యాప్తు చేస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలో గతంలో జరిగిన హత్య కేసులలో నిందితులకు శిక్ష పడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసు పట్టిష్టంగా దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరగా పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం మృతదేహం లభించిన సంఘటన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

## గుర్తు తెలియని శవం లభ్యం



**ముద్ర, తుంగతుర్తి:** తుంగతుర్తి మండల పరిధిలోని కొత్త గూడెం గ్రామ శివారు లో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు, శనివారం విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడని గ్రామస్తుల ద్వారా సమాచారము రాగా అక్కడికి వెళ్లి చూడగా సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మారోజు వీరన్న విగ్రహం క్రింద ఉన్న స్థలము (షెడ్) లో చనిపోయి ఉన్నాడు అని తెలిపారు .కాగా చనిపోయిన వ్యక్తి గురించి చుట్టూ ప్రక్కల విచారణ చేయగా ఎలాంటి ఆచూకీ లభించ లేదని తెలిపారు.మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించ లేదని ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చి మార్చూరి గదిలో భద్ర పరిచినట్లు తెలిపారు.మృతుడు ఆకు పచ్చ, తెలుపు రంగు గల టీ షర్టు మరియు బ్లూ గీతలు కలిగిన రంగు గల లుంగీ ధరించి ఉన్నాడని, ఎవరికైనా మృతుడి వివరాల గురించి సమాచారం తెలిసిన వెంటనే 8712686036 నెంబర్ కు తెలపాలని ఎస్సై తెలిపారు.

**బోన్ క్యాన్సర్:**

కాలంలో వైద్య పరీక్షలు (దయాగ్నోసిస్) ఎముకల నొప్పులు దీర్ఘ కాలంగా వేధిస్తుంటే ఎక్స్-రే, సీటీ స్కాన్ తదతర పరీక్షల ద్వారా కారణాన్ని తెలుసుకోవాలి. ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుండి తప్పించవచ్చు.



# అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్

**- కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్**



**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:** ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ ఎస్ అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సీటీని రద్దు చేస్తామని ఎమ్మెల్యే హరీష్ రావు అనడం తగదన్నారు. ఫ్యూచర్ సీటీ భవిష్యత్తు తరాల వారికి ఉపయోగ పడుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ లో ప్యాక్టరీలు ఏర్పడి రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడమంటే రాబోయే తరాల వారి జీవితాలతో అడుకోవడమేనన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ ఎస్ నాయకులు సిద్ధిపేటలో అభివృద్ధి జరగలేదనడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో కల్వకుంట్ల కుటుంబం చరిత్రలో నిలిచిపోతారన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని తెలిపారు. కేసీఆర్ ను నమ్మి పదేళ్లు ప్రజలు అధికారం ఇస్తే కల్వకుంట్ల కుటుంబం ఖజానాను మొత్తం దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు. ధనిక రాష్ట్రం దివాలా తీసినా కల్వకుంట్ల కుటుంబం మరింత కోటీశ్వర్లుగా మారారన్నారు. తెలంగాణ ప్రజల జీవితాలు, నిరుద్యోగుల తల రాతలు మాత్రం మారలేదన్నారు. కొత్త పార్టీలు పెట్టడానికి కవితకు వేల కోట్ల డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆ డబ్బులు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ఖజానా నుంచి ఆమెకు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సిద్ధిపేట అభివృద్ధి జరగలేదని బీఆర్ ఎస్ నాయకులు అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను ఇష్టం వచ్చినట్లుగా దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల కేసీఆర్ పాలనలో చేసిన అప్పులను ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతినెలా ఐదు వేల కోట్ల రూపాయలు వడ్డీ కడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలోని పథకాలు ఆపకుండా ముఖ్యమంత్రి రేవంత్ కొనసాగిస్తున్నారని తెలిపారు. సిద్ధిపేట అభివృద్ధి జరగలేదని అబద్ధాలు మాట్లాడకుండా బీఆర్ ఎస్ నాయకులు నిరూపించాలన్నారు. సిద్ధిపేట అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే బీఆర్ ఎస్ నాయకులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గ్యాదారి మధు, గాయాజుద్దీన్, హర్షద్, విజయ్, డానియల్, రాజిరెడ్డి, నజ్జు సంతోష్ గౌడ్, బాబా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని బహిష్కరించిన కమిటీ సభ్యులు

**- సమావేశం వాయిదా**




**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:** జీవో నంబర్ 252 లో పొందుపరిచిన కొన్ని నిబంధనలను వ్యతిరేకిస్తూ శనివారం కలెక్టర్ అధ్యక్ష్యతన జరిగిన అక్రిడి టేషన్ కమిటీ సమావేశాన్ని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బహిష్కరించారు. దీంతో శనివారం రెండో విడత జరగాల్సిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం వాయిదా పడింది. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కె. రంగాచార్య, జిల్లా ప్రధాన కార్యదర్శి, కమిటీ సభ్యుడు పైడిపల్లి అరుణ్ కుమార్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కమిటీ సభ్యుడు కూతురు రాజి రెడ్డి, యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ అధ్యక్షుడు, కమిటీ సభ్యుడు ఐత శ్రీనివాస్, 143 యూనియన్ ప్రతినిధి కమిటీ సభ్యుడు మహిపాల్ రెడ్డి, కమిటీ సభ్యుడు వంశీ, పంగ రాజు, ఖలీముర్ రహమాన్ ఫొటో, వీడియో జర్నలిస్టు ప్రతినిధులు కమిటీ సభ్యులు ముంజ గిరి, సతీష్ లు సమావేశాన్ని బహిష్కరించి గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన G. O 252 లో పొందుపరిచిన కొన్ని నిబంధనల వల్ల చాలా సంవత్సరలుగా ప్రధాన పత్రికల్లో పనిచేస్తున్న మండలాల విలేకర్లకు, నియోజకవర్గ కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు అయ్యే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ప్రతి మండలానికి పత్రికకు సంబంధించిన సర్కులేషన్ సరిఫికెట్లు సబ్మిట్ చేయాలానే నిబంధన వల్ల ప్రధాన పత్రికల్లో పనిచేస్తున్న మండలాల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. నిబంధన వల్ల వెలుగు, నమస్తే తెలంగాణ, వార్త, మనతెలంగాణ, నవ తెలంగాణ, జనంసాక్షి, ఆంధ్ర ప్రభ, విజయ క్రాంతి, ప్రజాతంత్ర, సూర్య, మెట్రో, ప్రజా జ్యోతి, తెలుగు ప్రభ, మనం తదితర పత్రికలతో పాటు, పలు ఉర్దూ పత్రికలకు కార్డులు మంజూరు కావడం లేదని తెలిపారు. ఇది జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. చాలా ఏండ్లు గా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు కార్డులు రాకపోవడం వల్ల వారు మానసికంగా ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అర్హులైన సీనియర్ జర్నలిస్టుల ఆ వేదనను రాష్ట్ర సమాచార కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి జీఓ 252 ను సవరించి అందరికీ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డీపీఆర్ వో రవికుమార్ ద్వారా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ అయిన హైమవతికి వినతి పత్రం సమర్పించారు. నిబంధనలు సవరించి స్థానిక కేబుల్ టీవీల్లో పనిచేస్తున్న క్రియాశీల జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టు లకు ఇచ్చే కార్డుల విషయంలో కూడా కొన్ని నిబంధనలు సవరించాలాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## ఆర్థిక సాయం అందజేత



**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త బానోల్లా రాము కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ రూ.15 వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. ఈ మేరకు శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్ ఆధ్వర్యంలో నాయకులు. రాము కుటుంబానికి రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు.

## ఆహార భద్రత ప్రమాణాలపై అవగాహన



**మహదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఆహార భద్రత ప్రమాణాలపై భూపాలపల్లి, ములుగు ఆహార తనిఖీ అధికారులు వరుణ్ రెడ్డి, ధర్మేంద్ర అవగాహన కల్పించారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టాల్ నిర్వాహకులకు పరిశుభ్రత, నాణ్యమైన ఆహార పదార్థాల వినియోగం, భద్రతా ప్రమాణాలు పాటింపు వంటి అంశాలపై ప్రత్యేక సూచనలు చేశారు. పుష్కరాలకు భారీగా తరలివస్తున్న భక్తులకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యతను స్టాల్ యజమానులు గుర్తుంచుకోవాలని కోరారు. ఆహార పదార్థాల నిల్వ, తయారీ, వడ్డనలో పాటించాల్సిన నియమాలు, చేతుల పరిశుభ్రత, తాగునీటి వినియోగం వంటి అంశాలపై ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార తనిఖీ అధికారులు మాట్లాడుతూ భక్తుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఆహార పదార్థాల నాణ్యతలో నిర్లక్ష్యం సహించబోమన్నారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగరాజు, శాంపిల్స్ సేకరణ సిబ్బంది, నరేష్, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో విషాదం

**- గంటల వ్యవధిలో వదిన, మరదలు మృతి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన వదిన, మరదలు గంటల వ్యవధిలో కన్నుమూశారు. మృతులిద్దరూ నెలరోజుల లోపు పసికందులున్న బాలింతలు కావడం, ఒకరి మరణవార్త విన్న కాసేపటికే మరొకరు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. గ్రామానికి చెందిన కర్షన్న రమేష్ భార్య స్వాతి (26) ప్రసవం తర్వాత తన పుట్టినిల్లు చందంపేటలో ఉంటోంది. ఆమెకు నెలలోపు కుమార్తె ఉంది. గత రాత్రి స్వాతి అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో మెదక్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆమె కన్నుమూసింది. దాంతో అంత్యక్రియల నిమిత్తం స్వాతి మృతదేహాన్ని అత్తగారిల్లయిన రెడ్డిపల్లికి తీసుకువచ్చారు. స్వాతి మరణవార్త విన్న దిగ్భ్రాంతిలో ఉండగానే, ఆమెకు వరసకు మరదలైన సౌందర్య (27) కూడా అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయింది. సౌందర్యకు కూడా నెలలోపు కుమారుడు ఉన్నాడు.

ఆమె అత్తగారిల్లు వీరారెడ్డిపల్లి అయినప్పటికీ, ప్రసవం కావడంతో ప్రస్తుతం పుట్టినిల్లైన రెడ్డిపల్లిలోనే ఉంటోంది. సౌందర్యను వెంటనే నార్సింగ్ ఆసుపత్రికి తరలించారు. కానీ, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీంతో పసికందులకు తల్లిప్రేమ కరువైంది.

ఉత్తర తెలంగాణ వార్తలు..

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**బోథ్, ముద్ర:** చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని స్థానిక కోర్టుజూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్ సూచించారు. శనివారం ఆయన సోనాల మండలంలోని మారుమూల గ్రామాలైన కేశవ్ గూడా, సంపత్ నాయక్ తండాల లో తెలంగాణ హైకోర్టు అదేశాల మేరకు మొబైల్ లోక్ అదాలత్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు తక్షణమార్గం లోక్ అదాలత్ లేనని తెలిపారు. ఖర్చు లేకుండా సమస్యలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. పల్లెల్లో చట్టాలపై, తమ హక్కులపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండి బాధ్యత తో నడుచుకోవాలని తెలిపారు. యువత గంజాయి, గుడుంబా లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని సూచించారు. యువత చెడు అలవాట్లకు లోనయి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా మంచి మార్గంలో నడవాలన్నారు. పల్లెల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు సిర్పూర్ మహేష్, సందేశ్, చౌహాన్ అర్జున్ సింగ్, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# తిప్పన్నపేటలో అన్నదాతల ఆందోళన




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు సరిగా జరగడం లేదని, అలాగే ధాన్యం తరలింపునకు లారీలు రావడం లేదని తిప్పన్నపేట్ గ్రామ రైతులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో జగిత్యాల-సారంగపూర్ రహదారిపై ఇరువైపుల వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచి పోయాయి. సమాచారం తెలుసుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి




**ముద్ర, కోరుట్ల:** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్, పర్యావరణ అంబాసిడర్ మచ్చ రాజశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసవి శిబిరంలో శనివారం 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాపాడటంలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలన్నారు. వాయుకాలుష్యం వల్ల ప్రజలకు ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయన్నారు. జలకాలుష్యం వల్ల తాగునీటి కొరత ఏర్పడుతుందని తెలిపారు. చెట్లను నరకడం వల్ల వర్షాలు తగ్గుముఖం పడుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. పర్యావరణాన్ని రక్షిం చడంలో భాగంగా ప్రతి విద్యార్థి ఇంటి పరిసరాలలో మొక్కలు నాటి వాటిని పెంచాలని సూచించారు. విద్యార్థులు పుస్తకాలు, నోట్ బుక్ లను వృథా చేయవద్దన్నారు, పేపర్ తయారవుటకు చెట్లు ఉపయోగ పడుతున్నాయన్నారు. పర్యావరణం కాపాడటానికి విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. చిత్రలేఖనం, నాటకం ప్రదర్శించిన వారికి ప్రధానోపాధ్యాయులు గంగాధర్ బహుమతులను, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు చందా నాగరాజు, రవూఫ్, కృష్ణమోహన్ రావు, కిష్టయ్య, యోగా టీచర్ కస్తూరి వేణుగోపాల్, ఆర్ట్ టీచర్ పిసుక వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



**బోథ్, ముద్ర:** మండలంలోని పిప్పల్దారి గ్రామ శివారంలో అక్రమంగా తరలిస్తున్న కలపను శనివారం పట్టుకున్నట్లు ఇంచార్జి ఎఫ్ఆర్వో కవిత తెలిపారు. సమాచారం మేరకు తాము సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టగా ఎద్దుల బండిలో విలువైన టేకు దుంగలను లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. కలపను తరలిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి, ఎడ్లను కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ఎస్ఓ నాగారావు, ఎఫ్ బీ వో లు సంధ్యారాణి, అనిల్, నాగరావు, బేస్ వాచర్లు ఉన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com